## పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అల



16వ పేజీలో...


# ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం వార్త



బుధవారం 28, ఫిబ్రవరి 2024 16 పేజీలు




2 లో..

పాత కాలువ లాకులు ఎత్తేసిన రైతులు

అడ్డుకున్న పోలీసులు

20వేల ఎకరాల్లో పంట ఎండిపోతుందంటూ రైతుల ఆవేదన

# పాలేరులో.. జల జగడం

**ఖమ్మం ప్రభాతవార్త, ప్రత్యేక ప్రతినిధి :** నీటి ఎద్దడితో జిల్లాలో జలజగడాలు మొదలయ్యాయి.. పాలేరు పాత కాలువ గేట్లను రైతులు బలవంతంగా ఎత్తేశారు.. 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 20వేల ఎకరాల్లో ఎండిపోతున్న తమ పంటలను కాపాడలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కానీ పోలీసులు, నీటిపారుదల శాఖ అధికారులు రైతుల ప్రయత్నాన్ని అడ్డుకున్నారు.. రిజర్వాయర్లో నీటిమట్టం 14.20 అడుగులకు చేరింది.. మరో నాలుగు అడుగులు తగ్గితే డెడ్ స్టోరేజీ లెవల్‌కు వస్తుంది.. ప్రస్తుతం ఉన్న నీరు ప్రజలకు తాగడానికి 16 రోజులు మాత్రమే సరిపోతాయి.. సాగర్ నుంచి జలాలు వస్తే తప్ప ఈ నీటిని పంటలకు ఇవ్వడం సాధ్యం కాదని అధికారులు రైతులకు తేల్చి చెప్పారు.





9 లో..

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

70సెంటర్లు, మొత్తం 36,578 మంది విద్యార్థులు

ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 18,481

సెకండియర్ విద్యార్థులు 18,087 మంది

నిమిషం ఆలస్యమైనా "నో ఎంట్రీ"

ఖమ్మం,ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ః



# ఆలోచన ఒకటి.. ఆచరణ మరొకటి

మంత్రి ఇలాకాలోనే అప్రకటిత విద్యుత్ కోతలు

ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న విద్యుత్ అధికారులు

మరమ్మతుల పేరుతో గంటల తరబడి

సబ్ స్టేషన్లలో షట్‌డౌన్లు

**చింతకాని, ప్రభాతవార్త :** తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామంటూ ఇచ్చిన ప్రకటనలు డొల్లగానే మారనున్నాయా అన్న సంకేతాలకు నిదర్శనంగా విద్యుత్ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలోనే అప్రకటిత విద్యుత్ కోతలు కొనసాగుతూ ఉండడం విమర్శలకు తావిచ్చేదిగా మారింది.

5వ పేజీలో...

**భద్రాచలం, ప్రభాతవార్త :** కాంగ్రెస్‌లో పదవుల పందేరం ఇక ప్రారంభం కానుంది. రాష్ట్రంలో తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఇక నేతల దృష్టి పదవులపై పడింది. ఎంపీ ఎన్నికల అనంతరం పెద్ద ఎత్తున నామినేటెడ్ పదవులు భర్తీకి నోచుకోనున్నాయి. అంతేకాకుండా స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సమాలోచన చేస్తుంది. ప్రజాప్రతినిదులను గెలిపించుకునే బాధ్యత తమదేనంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించడాన్ని బట్టి ఎంపీ ఎన్నికల అనంతరం స్థానిక ఎన్నికల సంగ్రామం తథ్యమన్న సంకేతాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతల్లో అలజడి మొదలైంది. తమ తమ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఎవరికి వారే నిమగ్నమయ్యారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌లో నూతనోత్సాహం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

# ఆశల పల్లకీలో..

కాంగ్రెస్‌లో పదవుల పందేరం

నామినేటెడ్ పదవులపై గంపెడు ఆశలు

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

ఎంపీ ఎన్నికల పనితీరే గీటు రాయి

కాంగ్రెస్‌లో పదవుల పందేరం తెలంగాణ రాష్ట్రంలో పదేండ్ల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది. ప్రభుత్వం ఏర్పాటు అయ్యి కొద్ది నెలలే అవుతున్నప్పటికి ప్రస్తుతం తెరపైకి పార్లమెంట్ ఎన్నికలు రావడంతో రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం ఆ ఎన్నికలపైనే



2వ పేజీలో...

# పాలేరులో జల జగడం

(మొదటి పేజీ తరువాయి..)



కూసుమంచి పరిధిలోని పాలేరు బ్యాలెన్స్ రిజర్వాయర్లు నీటిమట్టం దాదాపు డెడ్ స్టోరేజ్‌కి చేరుకుంటుంది. ఈ తరుణంలో ఆ రిజర్వాయర్ ఎడమ కాలువ పరిధిలో ఉన్నటువంటి 20 వేల ఎకరాల ఆయకట్టు పరిధిలో ఉన్న పంటలు ఎండిపోతుండడంతో రైతులు బలవంతంగా ఆ కాలువ గేట్లను ఎత్తే ప్రయత్నం చేశారు. కనీసం ఐదు రోజులపాటు నీటిని విడుదల చేస్తే తమ పంటలు ప్రాణం పోసుకుంటాయని రైతులు పేర్కొంటున్నారు. అధికారుల అనుమతి లేకుండా బలవంతంగా రైతులు మంగళవారం 100 క్యూసెక్కుల నీటిని కాల్వకు విడుదల చేశారు. కాగా పోలీసులు రైతులను అడ్డుకోవడంతో ఇటు రైతులు, రైతు సంఘ నాయకులు పోలీసుల మధ్య కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. నీటిపారుదల శాఖ జిల్లా అధికారులు రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కొద్దిసేపు రైతులు తమ పంటలను కాపాడాలని కోరుతూ సూర్యాపేట - ఖమ్మం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పాలేరుతో సహా జిల్లాలోని మధ్యతరహా నీటి ప్రాజెక్టులు నీరు దాదాపు డెడ్ స్టోరేజ్ లెవల్‌కు వస్తోంది. దాంతో జిల్లాలో నీటి ఎద్దడి ఛాయలు కనిపిస్తున్నాయి. ఈ సంవత్సరం వర్షాకాలంలో వర్షపాతం దాదాపు 40 శాతం తగ్గడంతో నీటి ఎద్దడి ఏర్పడిందని పలువురు అంటున్నారు. అదే సందర్భంలో నాగార్జున సాగర్ కూడా ఈ సంవత్సరం నిండకపోవడంతో నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవడం రైతుల పంటల పాలిట శాపంగా మారింది. నాగార్జునసాగర్ నుండి ఎడమ కాలువకు నీటిని విడుదల చేయకుంటే జిల్లా వ్యాప్తంగా కూడా తాగునీటికి కూడా ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. ఇదిలా ఉంటే సాగర్ నుండి నీరు విడుదల చేసి నోటి కాడికి వచ్చిన తమ పంటలను కాపాడాలని, పాలేరు ఎడమ కాలువ ఆయకట్టు రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలలో తగ్గిపోవాల్సిన రిజర్వాయర్ల నీటి మట్టాలు ఫిబ్రవరి నెలలోనే తగ్గిపోవడం నీటి ఎద్దడి తీవ్రతను తెలియజేస్తోంది.

# ఆశల పల్లకీలో ..

(మొదటి పేజీ తరువాయి..)

దృష్టి సారించింది. గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవికాలం ముగిసినప్పటికి తిరిగి పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేని సమయం లేకపోవడంతో స్పెషల్ ఆఫీసర్‌ల పాలనలో గ్రామపంచాయతీలు నడుస్తున్నాయి. అయితే ఎంపీ ఎన్నికల అనంతరం గ్రామపంచాయతీ ఎన్నికలు ఆ తరువాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మహాలక్ష్మి, గృహజ్యోతి స్కీంలు ప్రారంభం సందర్భంగా మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి కృషి చేసిన కార్యకర్తల శ్రమను గుర్తిస్తామని, త్వరలో జరిగే సంస్థాగత ఎన్నికల్లో సర్పంచ్‌లు, వార్డుమెంబర్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జిల్లా పరిషత్ చైర్మన్‌లను గెలిపించుకునే బాధ్యత తమదేనని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇక ఎంపీ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయన్న వాస్తవం వెలుగు చూసింది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుండే తమ తమ వ్యూహరచనకు పదును పెట్టారు. నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పెద్ద ఎత్తున చేపడుతున్న నేపథ్యంలో ఆశావాహులు ఆయా పదవులను కైవసం చేసుకునేందుకు తమ తమ నేతల ప్రసన్నంకై పావులు కదుపుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవుల భర్తీకై నోటిఫికేషన్ కూడా వెలువడింది. కొన్ని చిన్న చిన్న ఆలయ పాలకమండలి ఏర్పాటుకు కూడా నోటిఫికేషన్ విడుదల అయ్యింది. అయితే ఎంపీ ఎన్నికల అనంతరం నామినేటెడ్ పదవుల వ్యవహారం తేలే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గ్రంథాలయాలు, ఇతర ఆలయ పాలక మండలిలు, వక్ఫ్‌బోర్డు, వివిధ రాష్ట్ర స్థాయి చైర్మన్ మెంబర్‌ల పదవులు దక్కించుకునేందుకు ఆశావాహులు ఎవరికి వారే ప్రయత్నాల్లో ఉన్నారు. దాదాపు పదేండ్ల విరామం తరువాత అనేక పదవులు దక్కే అవకాశం ఉండడంతో కాంగ్రెస్ నేతల్లో ఆనందోత్సాహాలు వ్యక్తం అవుతున్నాయి. నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులను కూడా దక్కించుకునేందుకు పలువురు యత్నిస్తున్నారు. త్వరలో అన్ని రకాల కమిటీలు ఏర్పాటుకు నోచుకోనున్నాయని సాక్షాత్తు సీఎంనే ప్రకటించడంతో ఒక్కసారిగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లుబుకుతోంది.

**-ఎంపీ ఎన్నికల పనితీరే గీటు రాయి**

తెలంగాణ రాష్ట్రంలో అతి త్వరలోనే ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. కాంగ్రెస్ నేతలు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి ఉంది. జిల్లాలో ఉన్న ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు అత్యధిక ఓట్ల మెజార్టీని తీసుకువచ్చేలా పార్టీ నేతలు దృష్టి సారించారు. ప్రధానంగా ముగ్గురు మంత్రులు ఉభయ ఖమ్మం జిల్లాలకు చెందిన వారే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండడంతో వారికి కూడా ఈ ఎంపీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి.

జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాల్లో నాలుగు నియోజకవర్గాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే విజయకేతనం ఎగురవేశారు. ఇక భద్రాచలం నియోజకవర్గంలో మాత్రమే టీఆర్ఎస్ అభ్యర్థి డా.తెల్లం వెంకట్రావు గెలుపొందారు. ఆయన కూడా త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని జోరు ప్రచారం సాగుతోంది. ఎంపీ ఎన్నికల్లో భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కాంగ్రెస్‌కే మెజార్టీ ఓట్లు దక్కే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే ఈ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో నేతల పనితీరును గీటురాయిగా పెట్టుకుని రానున్న స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో ప్రియార్టీ ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఈ ఎన్నికల్లో తమ తమ పనితీరును నేతల ముందు చూపించి లబ్దిపొందాలని కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు సైతం సమాలోచనలు చేస్తున్నారు.

# మానసిక ఒత్తిడికిలోను కాకుండా పరీక్షలు రాయాలి

## ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ

*గూడూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త*

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు లోను కాకుండా పరీక్షలకు హాజరు కావాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సమ్మెట సత్యనారాయణ కోరారు. ఆయన మంగళవారం 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ ఈనెల 28 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కళాశాలల నుండి ప్రథమ సంవత్సరానికి 4560 మంది, ద్వితయ సంవత్సరానికి 4909 మంది మొత్తం 9469 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఇందులో 2455 మంది వృత్తివిద్యా కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉన్నారన్నారు. జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణ కొరకు 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయన్నారు. ఈ పరీక్షా కేంద్రాల్లో 250 మంది ఇన్విజిలేటర్లుగా తమ విధులు నిర్వహిస్తారని, సిట్టింగ్ స్క్వాడ్స్ రెండు, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఒకటి పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తుందన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతించబోరన్నారు. హాల్ టికెట్స్ అందని విద్యార్థులు ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, విద్యార్థి ఫోటో, సంతకం, సబ్జెక్ట్, గ్రూప్, సెకండ్ లాంగ్వేజ్ మొదలైన వాటిలో తప్పులుంటే తమను సంప్రదించా లన్నారు. హాల్ టికెట్లపైన సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. విద్యార్థుల నిర్దేశించిన సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకొని పరీక్షలు రాయాలని సత్యనారాయణ కోరారు.

**గూడూరు కేంద్రంలో 415 మంది విద్యార్థులు....**

గూడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 415 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు సూపరిండెంట్ సుమన్ తెలిపారు. మండలంలోని దామరవంచ గిరిజన గురుకుల కళాశాల, బ్రాహ్మణపల్లి కెజిబివి కళాశాల, మద్రిమిట్ట జ్యోతిబా పూలే కళాశాలల నుండి ప్రథమ సంవత్సరానికి 228 మంది, ద్వితీయ సంవత్సరానికి 187 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలని ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.



# భీజాపూర్ జిల్లాలో ఎదురు కాల్పులు

## -నలుగురు మావోయిస్టులు మృతి

**చర్ల, ప్రభాతవార్త :**

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. బీజాపూర్ జిల్లాలోని జంగల పోలీసు స్టేషన్ పరిధిలో గల చోటాటోన్గేర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లాకు చెందిన డీఆర్జీ, సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు పోలీసు బలగాలపైకి కాల్పులు జరపడంతో పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు. ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందగా పలువురు తప్పించుకున్నారు. నలుగురు మావోయిస్టులు మృతిచెందగా పలువురు తప్పించుకున్నారు. సంఘటన ప్రాంతంలో మావోయిస్టులకు సంబంధించిన మందుగుండు సామాగ్రి, విప్లవ సాహిత్యం పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరం చేసినట్లు బీజాపూర్ జిల్లా పోలీసులు తెలిపారు.

# ఇటుక బట్టీలను తనిఖీ చేసిన అధికారులు



**లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 27 – ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై తనిఖీ నిమిత్తం లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరం గ్రామ పంచాయతీలో ఉన్న ఇటుక బట్టీలను మైనింగ్ ఏడీ, తహసీల్దార్‌లు సంయుక్తంగా తనిఖీ చేశారు. కొన్ని ఇటుక బట్టీల వద్ద అక్రమ మట్టి నిల్వలను గుర్తించడం జరిగింది. ఆ అక్రమ నిల్వలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్య తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అట్టి ఇటుక బట్టీలకు మైనింగ్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బట్టీల నిర్వాహకులను మైనింగ్ ఏడీ ఆదేశించారు. మండలంలోని అన్ని ఇటుక బట్టీలు మైనింగ్ కార్యాలయంలో అనుమతులు తీసుకునేటట్లుగా సంబంధిత ఇటుక బట్టీల యజమానులకు తెలియజేయాల్సిందిగా తహసీల్దార్‌కు సూచించారు.

# ఆయిల్‌ఫామ్ సాగుతో రైతుకు ఎంతో మేలు

*మరిపెడ,ఫిబ్రవరి27,ప్రభాతవార్త*

ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లంపేట గ్రామంలో రైతు కేశబోయిన రవి ఆయిల్‌ఫామ్ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందన్నారు. రవాణా ఖర్చులతో పాటు క్రిమిసంహారక మందుల ఖర్చులు తగ్గుతాయన్నారు. ప్రతి ఒక్క రైతు ప్రత్యమ్నాయ పంటలపై దృష్టి సారించాలని యాజమాన్య పద్ధతులతో వ్యవసాయం చేసినట్లైతే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఈ పరిశీలనలో డోర్నకల్ నియోజకవర్గ ఉద్యానవనశాఖ అధికారి అనిత, భవాని ప్రసాద్, ప్రసాద్‌బాబు, నాగేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో స్పెషల్ డ్రైవ్ తనిఖీలు- అతిక్రమించిన వాహనాలపై కొరడా

## - రాంగ్ ప్లేట్లతో రాష్ డ్రైవింగ్ - చైన్ స్నాచర్లు నేరాల ప్రయత్నం

### - 44 వాహనాలు సీజ్

*క్రైమ్ ఖమ్మం, ఫిబ్రవరి 27:*

జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు మంగళవారం ఖమ్మం నగరంలో స్పెషల్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నంబరు ప్లేట్ లేకుండా రోడ్లపై తిరుగుతూ చక్కర్లు కొడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న వాహనాలపై కొరడా ఝుళిపించారు. నగరంలోని వివిధ కూడళ్లలో నెంబర్ లేకుండా రిజిష్టర్ లేని వాహనాలపై కేసులు జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నిబంధనలలో భాగంగా గతంలో జరిమానా విధించి చలనాలు ద్వారా డబ్బు చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతున్న వాహనాలను సైతం పోలీసులు గుర్తించారు. రిజిస్ట్రేషన్ నంబర్లలోని టియస్, ఎపి అక్షరాలతోపాటు చివరి రెండు నంబర్లు కనిపించకుండా స్టిక్కర్లు, మాస్క్, ప్లాస్టర్లు వేసి ఉన్న వాహనాలు తనిఖీల్లో పట్టుబడ్డాయి. మరికొన్ని వాహనాలకు ముందు నెంబర్ ప్లేటు సక్రమంగా ఉన్నప్పటికీ వాహనం వెనుకవైపు నంబర్‌ప్లేటును కనిపించకుండా వంచి రాంగ్ నంబర్ ప్లేట్లతో రోడ్లపై ఇష్టం వచ్చిన రీతిలో రాష్ డ్రైవింగ్ చేస్తు ప్రమాదాలకు కారణం అవుతున్నారు. మరోవైపు నంబరు లేకుండా ద్విచక్ర వాహనాలపై చైన్‌స్నాచర్లు, నేరాలు చేస్తు తప్పించుకొనే ప్రయత్నాలుచేస్తున్నారని పోలీసుల వాహన తనిఖీలో వాహనదారులకు అవగాహన కల్పించారు. వీటితో పాటు నంబరు ప్లేట్లు లేని వికృతమైన వాహనాలపై మోటారు వెహికిల్ చట్టం కింద 420/511 సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అట్టి వాహనాలను తరలించారు. ఫిబ్రవరి నెలలోనే 203 వాహనాలకు జరిమానా విధించడం జరిగిందని మరలా పనరావృతం అయిన ఎడల కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎసిపి బాణాల శ్రీనివాసులు తెలిపారు.

## పంచాయతీలో మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి



*పినపాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త*

మండల వ్యాప్తంగా పంచాయతీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఎంపిఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మల్లారం గ్రామ పంచాయతీలో ఎంపిడిఓతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు చందా వరప్రసాద్ గ్రామంలోని మంచినీటి సమస్యను ఎంపిఓ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన అధికారులు రెండు రోజుల్లో గ్రామంలోని తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో మంజూరై పూర్తి అయిన సిసి రోడ్లను, ఎన్‌ఆర్‌ఈజీఎస్ మొక్కలు పెంచే నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సాయికృష్ణ, ఆశోక్, పడిగసాయి, పోలిబోయిన సంపత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మిర్చితోటను పరిశీలించిన అమెరికా బృందం



*కరకగూడెం,ప్రభాతవార్త:*

మండలంలోని భట్టుపల్లిలోని మిర్చీ తోటలను ఐటిసి ప్రతినిధి అమరేందర్ రెడ్డి.దామోదర్.శ్రీనివాస్‌రెడ్డి ఆద్వర్యంలో అమెరిక బృంధం మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడి మిర్చిపంట సాగు చేస్తున్న పనితీరు పెట్టుబడి,దిగుబడి, ఫెస్ట్‌సైడ్,ఫెర్టిలేజర్స్ తధితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అమెరికాకు చందినవారు ఎలీష్‌బెల్స్, మాత్చుత్‌జాకబ్, రైతులు బిర్ర విష్ణు,పూనేం బుచ్చయ్య,ముద్దం సతీస్ సమిట్టపల్లి సతీష్,ఆవుదొడ్డి శ్రీను,గోసంగి శంకర్ తదితరులు పాల్గొన్నారు..

## కాంగ్రెస్‌లో చేరిన పూలమ్మ దంపతులు

*ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి27,ప్రభాతవార్త :*

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విఫ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఆల్డా చైర్మన్, మాజీ మదర్ డైరీ డైరెక్టర్ మోతే పిచ్చిరెడ్డి పూలమ్మ దంపతులు చేరారు.

## ఉద్యోగాల పేరిట పైకం వసూలు చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

*కారేపలి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :*

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని మోసానికి పాల్పడిన నింధితుని భాగ్యనగర్‌తండాకు చెందిన ప్రేమ్‌కుమార్‌పై మంగళవారం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైనట్లు కారేపల్లి ఎస్సై రాజారాం తెలిపారు. నింధితుడు పేరుపల్లిలోని బానోతు తులసిరాం, అజ్మీర దివ్య, గుగులోతు రమేష్, బానోతు రఘు అనే వ్యక్తులను వివిధ రకాల ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి సుమారు రూ. 2కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. బాధితులు ప్రశ్నించినప్పుడల్లా రేపు ఇస్తా... మాపిస్తా అని దాటివేస్తూ, వారికి నఖిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, నఖిలీ సర్వీస్ రిజిస్ట్రర్ ఇచ్చినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నింధితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు చికిత్స పొందుతూ మృతి

*కారేపల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :*



కారేపల్లి మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన పూసం సాయికృష్ణ(17) గాంధీనగర్ నుండి ఇల్లందు మండలం బొజ్జయిగూడెం సమ్మక్క-సారలమ్మ గద్దెలకు ఈ నెల 24న సాయంత్రం 7గంటలక వెళ్ళి తిరిగి వస్తుండగా బొజ్జాయిగూడెం పెట్రోల్ బంకు వద్ద అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం నుండి ప్రమాదవశాత్తు కిందపడి, తలకు తీవ్ర గాయాలు కావడంతో 108ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్ధితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని గాంధీనగర్ హాస్పిటల్‌కు చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు మంగళవారం సాయంత్రం సాయికృష్ణ మృతదేహాన్ని గాంధీనగర్‌కు తరలించారు. చేతికి అంది వచ్చిన కొడుకు మరణించడంతో మృతుడి తల్లిదండ్రులు శివకుమార్, రామమూర్తి దంపతులు రోధిస్తున్న తీరు అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. సాయికృష్ణ మరణంతో గాంధీనగర్‌లో విషాఛాయలు అలుముకున్నాయి.

## సాగునీటిని విడుదల చేయకపోతే ఆందోళన ఉదృతం చేస్తాం

*గుండాల, ఫిబ్రవరి27,ప్రభాతవార్త :*

తలాపున్నే రిజర్వాయర్ ఉన్నప్పటికీ సాగునీరు అందక అన్నదాతలు అన్నమో రామచంద్ర అంటున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర ఆరోపించారు. మంగళవారం ఆయన సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించి తహాసిల్దార్ జల కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన కాలువలకు సక్రమంగా సీసీ చేయకపోవడంతో తీసిన కాలువలు బొందలుగా మారుతున్నాయని ఆయన ఆరోపించారు. అన్నదాతల కడగండ్లు తీర్చేందుకు సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో సాగునీటిని విడుదల చేయకపోతే సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏకకాలంలో రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేసి, గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేరాలు-దారుణాలు

## ఫోక్సో కేసులో వ్యక్తికి జైలుశిక్ష

*కొత్తగూడెం లీగల్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:*

ఫోక్సో కేసులో వ్యక్తికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి శ్యాంశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. మణుగూరు సర్వెంట్ క్వార్టర్స్‌కు చెందిన మైనర్ బాలికపై సంతోష్‌నగర్‌కు చెందిన మోత్కూరి వెంకటేశ్వర్లు 15.2.2021న అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నం చేశాడని, మోత్కూరి వెంకటేశ్వర్లు అల్లుడు కొత్తూరి సందీప్ అసభ్యకరంగా ప్రవర్తించాడని మణుగూరు పీఎస్‌లో మైనర్ బాలిక 24.2.2021న ఫిర్యాదు చేసింది. అప్పటి ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో 9 మంది సాక్షులను విచారించగా మోత్కూరి వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కాగా ఐపీసీ 506 ప్రకారం ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానాతో పాటు ఐపీసీ 354-ఏ ప్రకారం ఒక ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా మొత్తం రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు శిక్షలు ఏక కాలంలో అనుభవించాలని తీర్పు చెప్పారు. మోత్కూరి వెంకటేశ్వర్లు అల్లుడు కొత్తూరి సందీప్‌పై నేరం రుజువు కాలేదని కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రావి విజయ్‌కుమార్ నిర్వహించారు.

## రైలు కింద పడి యువకుడితో కలిసి వివాహిత ఆత్మహత్యాయత్నం





*మధిరరూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:*

రైలు కింద పడి యువకుడితో కలిసి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మధిర మండలం తొండలగోపారం-దెందుకూరు గ్రామాల మధ్య మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం... ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామానికి చెందిన గంతాల సాయికృష్ణ(24), గంతాల శ్రీలక్ష్మీ(24)ఇద్దరూ కలిసి తమకు ఉన్న వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇద్దరూ ప్రాణాలతో ఉండటం గమనించిన రైల్వే ఆన్‌డ్యూటీ గ్యాంగ్‌మెన్ జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తీవ్రంగా గాయపడిన వీరిద్దరిని 108వాహనం ద్వారా మధిర ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

## సిపిఎం సీనియర్ సభ్యుడు దారెల్లి మృతి



*బోనకల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త*

మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామ సిపిఎం సీనియర్ సభ్యుడు దారెల్లి నాగేశ్వరరావు (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగేశ్వరరావు భౌతికకాయంపై సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సురేష్‌లు సిపిఎం పతాకాన్ని కప్పి ఘనంగా నివాళ్లర్పించారు.




# మండమెలుగుటతో జాతర ప్రారంభం

-మారాయిగూడెంలో ప్రారంభం

అయిన సమ్మక్క సారలమ్మల జాతర

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :

చిన్న మేడారంగా పిలవబడుతున్న దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం మండలంలోని గిరిజన ఇలవేల్పు దేవతలు అయిన శ్రీసమ్మక్క సారలమ్మల జాతర మంగళవారం మండమెలుగుటతో ప్రారంభం అయ్యింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి ఐదు రోజుల పాటు మారాయిగూడెం గ్రామంలో సమ్మక్క సారలమ్మల జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తుంటారు. దేవరబాలలుగా సోడి శాంతమ్మ, అచ్చెమ్మలు వ్యవహరించగా జాతర కమిటీ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. మంగళవారం సమీపంలో ఉన్న చెరువు వద్దకు మేళతాళాలు డప్పు వాయిద్యాలతో వెళ్ళి గంగా నీళ్ళను తీసుకుని వచ్చి గద్దెలను శుద్ది చేశారు. ఈ సందర్భంగా గంగ పూజను



నిర్వహించారు. మారాయిగూడెంలో జరిగే జాతరకు సమీప ఛత్తీస్‌ఘఢ్, మధ్యప్రదేశ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో నుండి అనేకమంది భక్తులు మారాయిగూడెం గ్రామం వద్ద శ్రీసమ్మక్క సారలమ్మలను దర్శించుకుని తమ మొక్కుబడులను చెల్లించుకుంటారు. మారాయిగూడెం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతర కమిటీ ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. గ్రామపంచాయతీ నుండి శానిటేషన్, త్రాగునీరు తదితర సౌకర్యాలను సిద్ధం చేశారు. గిరిజనుల ఆరాద దేవతలు అయిన సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు గిరిజనులే కాకుండా అనేకమంది భక్తులు, వీఐపీలు వచ్చి తమ మొక్కుబడులను చెల్లించుకుని అమ్మవార్లను దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు అవుతారు. ఇదిలా ఉండగా బుధవారం ఒక్కపొద్దు రాత్రి 10 గంటలకు దేవతా నిషాణులు గుడికి వచ్చే కార్యక్రమం నిర్వహిస్తారు.

## పోలియో కార్యక్రమంపై అవగాహన

దుమ్ముగూడెం, ఫిబ్రవరి27,ప్రభాతవార్త :



జాతీయ పోలియో కార్యక్రమంపై పర్ణశాల, దుమ్ముగూడెం పీహెచ్‌సీలో వైద్యఆరోగ్య సిబ్బందికి ఆశావర్కర్లకు అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. పర్ణశాల, దుమ్ముగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.స్వప్నికారెడ్డి, డా.పుల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో 0 - 5 సంవత్సరాలలోపు పిల్లలందరికి త్వరలో జరిగే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతి ఒక్క పిల్లలకు పల్స్ పోలియో కార్యక్రమం అందేలా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం పర్ణశాల వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

-సమ్మెలో పాల్గొన్న హాస్టల్ వర్కర్లు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి27,ప్రభాతవార్త :




హాస్టల్‌లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హాస్టల్‌లో పనిచేసే వర్కర్లు మంగళవారం సమ్మెలో పాల్గొన్నారు. కే.రేగుబల్లి ఆశ్రమ పాఠశాల ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో హాస్టల్ వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు కాక సమ్మక్క, తదితరులు మాట్లాడుతూ .. 12 నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని, గత ప్రభుత్వంలో అనేక పర్యాయాలు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదని, కొత్తగా వచ్చిన ప్రభుత్వం హాస్టల్‌లో పనిచేసే వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మెలో పాల్గొంటామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కల్పవృక్ష నారసింహుని సేవలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :

భద్రాచలం పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంకు సమీపంలో ఉన్న శ్రీ కల్పవృక్ష నారసింహస్వామి వారిని మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించి ముడుపులు కట్టారు. ఈయనకు కల్పవృక్ష నారసింహ ఆశ్రమం నిర్వాహకులు డా.కృష్ణచైతన్యస్వామి ప్రత్యేక పూజాలు చేసి నృసింహ రక్ష, సాలగ్రామ తీర్థాన్ని అందజేశారు. ఆర్థిక పరిస్థితి, కుటుంబ సమస్యలు, విద్య, ఉద్యోగం కొరకు ప్రతినిద్యం భక్తులు ఇక్కడ ముడుపులు కట్టుకోవడం విశేషమని ఎమ్మెల్యే అన్నారు.



## గిరిజన కార్మికుల ఆకలి బాధను తీర్చండి

-సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి

భద్రాచలంక్రైం, ప్రభాతవార్త :




గిరిజన సంక్షేమ శాఖ కళాశాల అనుబంధ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన 18 నెలల వేతన బకాయిలు చెల్లించాలని గిరిజన కార్మికుల ఆకలి బాధలు తీర్చండి అంటూ నిరవధిక సమ్మె చేపట్టారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. పోస్టు మెట్రిక్ హాస్టల్స్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు, ఆశ్రమ పాఠశాలల ఐదు నెలల బకాయిల కోసం సమ్మె చేస్తున్నారని అన్నారు. 18 నెలలు వేతనాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను ఎన్నిసార్లు తీసుకెళ్ళినా స్పందించలేదన్నారు. పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో పనిచేస్తున్న కార్మికులలో క్యాటరింగ్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ హెచ్చరించింది. సమ్మెకు ప్రభుత్వం అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగరాజు, హాస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, నాయకులు రామారావు, సుభద్ర, శ్యామల, నాగమణి, ఆదిలక్ష్మి, కాంతమ్మ, ధర్మమ్మ, రామయ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్య సేవలో ప్రముఖులు

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :



భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారిని మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి మల్లుభట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని దర్శించు కున్నారు. అదేవిధంగా గ్లోబల్ హ్యూమంటేరియల్ మిషన్ ఫౌండర్ సద్గురు మధుసూదన్ సాయి దర్శించుకున్నారు. వీరికి దేవస్థాన అర్చకులు, అధికారులు దేవస్థాన మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహింపజేశారు. అనంతరం దేవస్థానం ఆవరణంలోని శ్రీలక్ష్మీతాయారమ్మ వారి సన్నిధిలో కార్యనిర్వహణాధికారి ఎల్.రమాదేవి శ్రీస్వామి వారి పట్టువస్త్రాలు అందజేసి భద్రాద్రి రామయ్య మెమోంటోను బహూకరించారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి తీర్థప్రసాద వితరణ గావించారు.

## మల్లు నందినిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

సారపాక ప్రభాతవార్త:



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందినిని సోమవారం శ్రీ సీతారామచంద్ర స్వామి దర్శనం కొరకు వచ్చిన ఆమె ఐటీసీ పీఎస్పిడి అతిథి గృహంలో బసచేయగా కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవరగన కన్వీనర్ చందా సంతోష్ అధ్యక్షతన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో ఏజెన్సీ ప్రాంత సమస్యలను తన దృష్టికి తీసుకెళ్లి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చంద్రశేఖర చక్రవర్తి, బీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ వాసుదేవరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట నాగిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతరాల రవికుమార్, యూత్ కాంగ్రెస్ నాయకుడు బెల్లంకొండ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఉపాధి హామీ పనిలో నష్టపోతున్న కార్మికులు

సారపాక ప్రభాతవార్త:

సామాజిక తనిఖీ ప్రజావేదిక బూర్గంపహాడ్ మండలంలో ఎంపీడీవో కార్యాలయం ముందు మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనిలో ఉపాది కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఇబ్బందులకు గురి చేసి రానున్న కాలంలో ఈ పని కూడా తీసేయాలనే కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, బర్ల తిరుపతయ్య, కత్తి ప్రతాప్, సున్నిత తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం

బూర్గంపహాడ్ ప్రభాతవార్త:

స్థానిక ఐటీసీ అనుబంధ సంస్థ అయిన రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర, సారపాక వారి ఆధ్వరనయంలో స్థానిక గాంధీనగర్ శ్రీ సత్యసాయి స్కూల్‌లో పర్యావరణ పరిరక్షణను పొందించే దిశగా మంగళవారం మొక్కులు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ ఆర్‌టీఎన్. జయంత్‌కుమార్ దాసు మాట్లాడుతూ.. అందరికి పర్యావరణ కాలుష్యం, వాటి పరిరక్షణ గురించి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రో జయంత్ కుమార్ దాస్, సెక్రెటరీ కేవీఎస్ గోవిందరావు నిర్వహించారు. రోటేరియన్లు యాగి చంద్ర శేఖర్, నగ మల్లేశ్వర రావు, సాయిరాం, ప్రతాప్, సుధాకర్ రెడ్డి, భాస్కరరావు, పాల్గొన్నారు.


# ఆలోచన ఒకటి, ఆచరణ మరొకటి

## మంత్రి ఇలాకాలోనే అప్రకటిత విద్యుత్ కోతలు
## -ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న విద్యుత్ అధికారులు
## మరమ్మతుల పేరుతో గంటల తరబడి సబ్ స్టేషన్లలో షట్‌డౌన్లు

చింతకాని, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాను చేస్తామంటూ ఇచ్చిన ప్రకటనలు డొల్లగానే మారనున్నాయా అన్న సంకేతాలకు నిదర్శనంగా విద్యుత్ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలోనే అప్రకటిత విద్యుత్ కోతలు కొనసాగుతూ ఉండడం విమర్శలకు తావిచ్చేదిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని చూస్తున్న ఆరు గ్యారంటీల పథకాల్లో భాగంగా గృహజ్యోతి పథకానికి సంబంధించి మార్గదర్శకాలను రూపొందించి ఈనెల 27 నుంచి అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసిన క్రమంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ప్రభుత్వ లక్ష్యాన్ని ఆశయాన్ని ఎండగట్టేదిగా మారుతుండడం గుర్తించాల్సిన విషయం. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వం తరుపున ప్రకటనలు చేస్తూ విద్యుత్ కోతలు కనిపిస్తే అధికారులపై వేటు తప్పదని హెచ్చరికలు చేయడం తెలిసిందే. ఈ ప్రకటనలు వెలువడకు ముందు నుండే మధిర నియోజకవర్గంలో ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు నిలిపివేస్తూ విద్యుత్ యంత్రాంగం చేస్తున్న చర్యలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు విద్యుత్ లైన్ల మరమ్మతులు ఇతర అంశాలు బూచిగా చూపుతూ ప్రతిరోజు ఏదోఒక సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల పేరుతో ప్రకటనలు విడుదల చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది.

ప్రధానంగా విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతులు విద్యుత్ లైన్ల మరమ్మతులు అనేవి నిర్వహించాల్సి అవసరం ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే జరుగుతోంది. కాని ఆలోచన ఒకటి, ఆచరణ మరోకటి అన్న రీతిలో విద్యుత్ కోతలను పరోక్షంగా అమలు చేస్తూ ప్రభుత్వానికి బాసటగా నిలిచేందుకు విద్యుత్ యంత్రాగం చేస్తున్న దాగుడు మూతల దోపిడిపై అన్ని వర్గాల ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తిస్థాయిలో వేసవి కాలం రాకముందే కొనసాగుతున్న విద్యుత్ కోతల పరంపర గృహజ్యోతి పథకం అమలు తర్వాత మరింత సమయం కోతలను భరించాల్సిన పరిస్థితి నెలకొంటుందా? అన్న ప్రజలు సామాన్య ప్రజల నుంచఇ వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలతో పాటు ప్రజలకు మెరుగైన రీతిలో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు చూపుతున్న చొరవకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం సహకరించకపోవడం తద్వారా ప్రభుత్వానికి పరోక్షంగా భంగపాటును కల్పించే దిశగా చేస్తున్న చర్యల పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని రాజకీయ పార్టీలు కోరుతున్నాయి.




## సీసీ రోడ్లకు శంకుస్థాపన



మధిరరూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:

మధిర మండల పరిధిలోని నిధానపురం, సిరిపురం గ్రామాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ మెండెం లలిత మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, ఎంపీటీసీ నంద్రు కుమారి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంపటి రమేష్, బాదా కోటిరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, గుండా లక్ష్మీ, పద్మ, దేవరాజు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డుకు నిధులు విడుదల



బోనకల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

మండలంలోని నారాయణపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నిధులు ఐదు లక్షల రూపాయలు సిసి రోడ్డుకు విడుదల చేశారు. మంగళవారం ఆ రోడ్డును ప్రొక్లైన్ ద్వారా చదును చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తినేని తిరుపతయ్య, సూర్యదేవర సుధాకర్, బండి పవన్, కోట యువరాజు, కోట శ్రీనివాసరావు, కోట కిశోర్, దుద్దు ఏసు, కొంగల ప్రభాకర్, కోట శరాబంది, కొంగల శ్రీను, మొండితోక భూపతి తదితరులు పాల్గొన్నారు.

## పంచముఖ వేదగాయత్రీ మాత బ్రహోత్సవాలు



మణుగూరు, ప్రభాతవార్త, ఫిబ్రవరి 27 :

మణుగూరు మండలం గుట్టమల్లారం గ్రామంలోని శ్రీ పంచముఖ వేదగాయత్రీ మాత ఆలయం 16వ వార్షిక బ్రహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష్మీగణపతి, గీతా హోమం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గీతా ధర్మ ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం తదితర కార్యక్రమాలు అంగరంగవైభంగా నిర్వహించారు. ఈ నెల 28న కళ్యాణార్థం స్వామివారి, అమ్మవారి శాంతి కళ్యాణం నిర్వహించి అన్నప్రసాదం అందజేయనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అక్కినేపల్లి వసంతాచార్యులు, అక్కినేపల్లి ప్రదీప్‌శాస్త్రీలు తెలిపారు.

## అమరుడు కొడిపెల్లి ఆదర్శప్రాయుడు



మణుగూరు, ప్రభాతవార్త, ఫిబ్రవరి 27 :

దళిత బహుజన పక్షపాతి కార్మిక సమస్యలపై యాజమాన్యాన్ని నిలదీసిన హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు అమరుడు కొడిపెల్లి శ్రీనివాస్ యువతకు ఆదర్శప్రాయుడని బహుజన సాహిత్య అకాడమీ అంతర్జాతీయ అధ్యక్షులు నల్ల రాధకృష్ణ అన్నారు. ఆయన సోమవారం రాత్రి మణుగూరు ఏరియా పీవీ కాలనీ హెచ్ఎంఎస్ కార్యాలయం ఆవరణలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు అమరుడు కొడిపెల్లి శ్రీనివాస్‌కు ప్రకటించిన సందర్భంగా ఏరియా బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొని మాట్లాడారు. అమరుడు కొడిపెల్లి శ్రీనివాస్‌కు ప్రకటించిన అవార్డును అతని భార్య కొడిపెల్లి శ్రీలత అందుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా అధికార ప్రతినిధి జీవన్‌జోయల్, సింగరేణి ఎస్సీ ఎంప్లాయిస్ లైజన్ ఆఫీసర్ నర్సింహారావు, రమేష్, ఏరియా యూనియన్ల నాయకులు వి.కృష్ణంరాజు, మేకల ఈశ్వర్‌రావు, నాసర్ పాషా, మంగీలాల్, శనిగారపు కుమారస్వామి, మందాడి సంజీవ, నల్లా జ్యోతి, మానస, గుప్తా, శ్రీనివాస్, ఈశ్వర వైశాలి, బూర్గుల వెంకటరత్నం, ఇమామూద్దీన్, శ్రీలత, భీంసింగ్, సత్యనారాయణ, నాగరాజు, సంతోష్, శ్రీనివాసరెడ్డి, రఖీమ్, రామ్‌లాల్, మురళీకృష్ణ, జితేందర్, రాజ్‌కొమురయ్య, వినోద్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య

మణుగూరు క్రైమ్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 27 :

మణుగూరు పట్టణంలోని పీకే-1 సెంటర్ ఏరియాకు చెందిన ధనుగూరి స్వాతి(23) పిల్లలు కలగడం లేదనే మనోవేధనతో ఆత్మహత్య చేసుకున్నట్లు మణుగూరు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్వాతికి వివాహమై నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ పిల్లలు కలగడంలేదని తీవ్ర మనోవేధనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## పరీక్ష సమయాల్లో జిరాక్స్ సెంటర్లు తెరవద్దు
## -మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి



మణుగూరు, ప్రభాతవార్త, ఫిబ్రవరి 27 :

ఈనెల 28 నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయాల్లో తెరవద్దని మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మణుగూరు మండల కేంద్రంలోని జిరాక్స్ సెంటర్లను సందర్శించి ఎట్టి పరిస్థితిలో పరీక్ష సమయాల్లో జిరాక్స్ సెంటర్లు తెరవద్దని సూచించారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మద్దులగూడెంలో హెల్త్ క్యాంపు



మణుగూరు, ప్రభాతవార్త, ఫిబ్రవరి 27 :

మణుగూరు మండలం మద్దులగూడెంలో మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. మణుగూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శివకుమార్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తొలుత నాలుగు టీంలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అరుణ్‌బాబు, రాంప్రసాద్, ప్రమీల, పుష్ప, రవి, హిమబిందు, వినయ్, ఇంధిర తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చుంచుపల్లి, ఫిబ్రవరి 27 - (ప్రభాతవార్త):



మండలంలోని విద్యానగర్ పంచాయతీ పరిధిలోని ఖమ్మం - కొత్తగూడెం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... జూలూరుపాడు మండలం గుండెపుడి గ్రామానికి చెందిన గోగుల నరసింహారావు (28) అనే యువకుడు కొత్తగూడెం నుంచి జూలూరుపాడు నంబర్ టీఎస్ 28 ఎల్ 7399 గల పల్సర్ బైక్‌పై వెళ్తున్న క్రమంలో విద్యానగర్‌లో బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో వెహికిల్‌పై ఉన్న వ్యక్తి తల భాగం డివైడర్‌ను గుద్దుకొని అక్కడికక్కడే మరణించడం జరిగింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన యువకుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం ఇవ్వడం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా దవాఖానాకు తరలించారు.

## టీఎన్‌జీవో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తగూడెం, ఫిబ్రవరి 27 - (ప్రభాతవార్త):

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. దీనికి ఎన్నికల అధికారిగా జి.వీరబాబు వ్యవహరించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంగళవారం ప్రకటించారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడిగా





అమరనేని రామారావు, కార్యదర్శిగా కంచర్ల సాయిభార్గవ చైతన్య అసోసియేట్ అధ్యక్షులుగా సిహెచ్ రామనర్సయ్య, కోశాధికారిగా జె.సోమయ్య, ఉపాధ్యక్షులుగా గడ్డం ఉష, ఉటుకూరు నాగేశ్వరరావు, గొల్లమందల రమేష్, జాయింట్ సెక్రటరీలుగా నవీన్, మాటేటి ఉష రాణి, కార్యవర్గ సభ్యులుగా అరుణ, మధుసూధన్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అమరనేని రామారావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను జిల్లాలో పేద ప్రజలకు చేరేలా కృషి చేస్తానని అన్నారు. గెజిటెడ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణతో ఉద్యోగస్తులకు కావాల్సిన అన్ని న్యాయబద్ధమైన విషయాలను తమ సంఘం ద్వారా ప్రభుత్వానికి విన్నవించి అందరికీ న్యాయం జరిగేలా చూడటంలో తమవంతుగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఉద్యోగుల సంక్షేమమే మాఎజెండా, ఎజెండా అని కొనియాడారు. కార్యదర్శి సాయిభార్గవ చైతన్య మాట్లాడుతూ... గతంలో జీవో 317 ద్వారా చెల్లాచెదురు అయిన కుటుంబాలను ఒకే దగనగరకు తీసుకురావాలనే సంకల్పంతో నూతన ప్రభుత్వం అట్టి జీవోపై అధ్యయనం చేసి నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేకూర్చాలని సదుద్దేశంతో ముగ్గురు సీనియర్ మంత్రులతో కమిటీని వేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## డిడిని అడ్డుకున్న విద్యార్థి సంఘాలు



ఇల్లెందు టౌన్, (ప్రభాతవార్త):

జిల్లా వ్యాప్తంగా హాస్టల్స్‌లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని వర్కర్లు సమ్మెకు దిగడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు ఐటీడీఏ/వైటీసీలో జరుగుతున్న డీడీ సమావేశాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నందున వర్కర్లు సమ్మెకు దిగడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. మంగళవారం వర్కర్లు సమ్మెకు దిగడంతో మధ్యాహ్నం వరకు విద్యార్థులు పస్తులున్నారని ఈ విషయం స్థానిక, ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వర్కర్ల సమస్య డీడీ, ప్రభుత్వ పరిధిలో ఉన్నందున వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైటీసీలో సమావేశానికి వచ్చిన డీడీని మాట్లాకుండా అడ్డుకున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై నినదించారు. దీంతో డిడి మణెమ్మ మాట్లాడుతూ సమస్యను పరిష్కారానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, కాంటి పృథ్వీ, ఏ.సాంబ, బయ్యా అభిమన్యు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు కుటుంబానికి ఇన్సూరెన్స్ అందజేత



చండ్రుగొండ, ఫిబ్రవరి 27 - (ప్రభాతవార్త):

మండల కేంద్రమైన చండ్రుగొండ డీసీసీబీ ఖాతా ఉన్న సీతాయిగూడెం నివాసి పిట్టల మారేష్‌కు డీసీసీబీ మేనేజర్ రాగమయి గత ఏడాది ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి ఇన్సూరెన్స్ కట్టించారు. ఈ మధ్యకాలంలో అనారోగ్య కారణం వల్ల చనిపోయాడు. వారి నామిని తల్లి అయిన పిట్టల వెంకమ్మకు బ్రాంచి మేనేజర్ రాగమయి రూ.2 లక్షల చెక్కుని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రియాంక, సృజన, స్వరూప, సీతాయిగూడెం నివాసి రాములు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి



కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 27 - (ప్రభాతవార్త):

భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో 28వ వార్డులోని రామాటాకీస్ ఏరియాలో భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాహి సంఘటన ద్వారా వృద్ధులకు, దివ్యాంగులకు ఉచిత పోషక ఆహార పొట్లాలు అందజేశారు. బీజేపీ జిల్లా కార్యాలయ సంస్థాపక కార్యదర్శి, బీజేపీ సీనియర్ నాయకులు గుమలాపురం సత్యనారాయణ ఆయన జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో రామారావు, వినోద్, ప్రశాంతి, నిర్మల, నిరంజన్,రవి పాల్గొన్నారు.

## విజయ సంకల్ప యాత్రకు కమలం శ్రేణులు స్వాగతం




కామేపల్లి,ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త):

బీజేపీ పార్టీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర కామేపల్లి మండలం పండితాపురం గ్రామంకు మంగళవారం చేరుకుంది. ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జీ మార్తినేని ధర్మారావు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో మధ్యప్రదేశ్ రాష్ట్ర



ఇన్‌చార్జీ పి మురళీధర్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ కార్యదర్శి దొంగల సత్యనారాయణ, ఖమ్మం కార్పొరేటర్, ఇల్లందు ఏసీ ప్రబారీ, బాలగాని గోపికృష్ణ కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు. కామేపల్లి మండల పార్టీ అధ్యక్షులు జర్పుల రామారావు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్యా శ్రీను నాయక్, జిల్లా కార్యదర్శి జాలె శ్రీనయాదవ్, వేముల వెంకట్‌నారాయణ, భాగం రంగారావు, పోలూరి రామచంద్రయ్య, కొమ్మినేని భద్రయ్య తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఇల్లందుకు యాత్ర బయలుదేరి వెళ్ళింది.




## అఖిలభారత యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



చుంచుపల్లి, ఫిబ్రవరి 27 - (ప్రభాతవార్త):

అఖిలభారత యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం సీఈఆర్ క్లబ్ రుద్రంపూర్‌లో ఆవిష్కరించారు. రుద్రంపూర్, గౌతంపూర్, చుంచుపల్లి, జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు సకినాల సమ్మయ్య యాదవ్ చేతుల మీదుగా ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బూటిక రాజేశ్వరరావు, కత్తెర్ల రాములు, బొల్లబోయిన నర్సింహారావు, కత్తుల రమేష్, బైరబోయిన రాజు, కంప రాజలింగు, పింగి ఓదేలు, వేల్పుల మహేష్, గుడెపు రంగారావు, కంప సంజీవ్, సాయి యాదవ్, కత్తుల కొమరయ్య, బొల్లారపు ఓదేలు, శ్రీకాంత్ యాదవ్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా రుద్రయాగ మహోత్సవం



కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 27 - (ప్రభాతవార్త):



మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్‌లో ఉన్న శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో రుద్రయాగ మహోత్సవ ఆహ్వానాన్ని నిర్వహించారు. ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చివరి రోజు పంచస్థాన అర్చనలు, ప్రాతఃకాల మహోత్సవం, మూర్తులకు, ఉమామహేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. మహాపూర్ణాహుతి, కలశమార్చన పూర్వక కతవాభిషేకం జరిగింది. అనంతరం ఉమామహేశ్వర స్వామి వారి శాంతి కల్యాణం జరిగింది. బ్రహ్మశ్రీ కొడమంచిలి ఫణికుమార్‌శర్మ బృందంచే కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మేరెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

## గణేష్ టెంపుల్‌లో నేడు సంకటహార చతుర్థి

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 27 - (ప్రభాతవార్త):

పట్టణంలోని ఎంజీరోడ్‌లో ఉన్న శ్రీ విజయవిఘ్నేశ్వర స్వామి దేవాలయంలో ప్రతినెల జరిగే మాదిరిగా ఈ నెలలో కూడా బుధవారం సంకటహార చతుర్థి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు స్వామివారికి అభిషేకం, 9.30 గంటలకు లక్ష్మీగణపతి హోమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈవో సులోచన తెలిపారు. భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈవో కోరారు.

## భూములను ఆక్రమించాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

పాల్వంచ, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:

పాల్వంచ రెవెన్యూ పరిధిలో తప్పుడు ధృవపత్రాలను సృష్టించి భూములను ఆక్రమించాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. పాల్వంచకు చెందిన మల్లెల రవిచంద్ర అనే వ్యక్తి 2006 సంవత్సరంలో పాల్వంచలోని సర్వే నంబర్ 804, 805లో 7 ఎకరాల భూమి కొనుగోలు చేసి దానిని ఇంటి స్థలాలుగా మార్చి అనేక మందికి అమ్మివేయడం జరిగింది. అతను అన్ని రకాలుగా రికార్డులు చూసి, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వారిని సంప్రదించి ఆ స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలాన్ని పాల్వంచకు చెందిన బండి కాంతమ్మ, సికా కృష్ణ, మేరీ, విజయ్‌లు ఓ విలేఖరి సహకారంతో సర్వే నంబర్ 802లో వారి పేరు మీద ఉన్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి తామే ఆ భూమికి వారసులమని చెప్పుకుంటూ కబ్జాలకు పాలనపడుతున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలనితహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు.

## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సన్మానం

ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త:

సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రియాంక అలను మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక సింగరేణి అతిథి గృహంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర



ప్రధాన కార్యదర్శి గోవికొండ శ్రీదేవి, ఎమ్మెల్యే సతీమణి కోరం లక్ష్మి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు రాధ [illegible] మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిలా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## న్యూడెమోక్రసీ దళసభ్యుడి అరెస్టు

ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త:

సీపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ దళసభ్యుడు నాయిని కొమరయ్య(62)అలియస్ కొమరన్న అరెస్టు చేసినట్లు ఇల్లెందు సిఐ కరుణాకర్ పేర్కొన్నారు. మంగళవారం విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అశోక్ దళం దళసభ్యుడిగా నాయిని కొమరయ్య అలియాస్ కొమరన్న పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇల్లెందు మండలం పూసపల్లిలో ఈ నెల 16న కొంత మంది సాయుధ దళ సభ్యులు పోలీసులను చూసి పారిపోతుండగా కొంత మందిని పట్టుకుని కోర్టుకు రిమాండ్ చేశామని అన్నారు. కొందరు తప్పించుకని పారిపోయారిని మంగళవారం దొంపేడు గుడిసెంటర్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా తాను అశోక్ దళంలో దళసభ్యుడిగా పనిచేస్తున్న కొమరన్నగా తెలిపినట్లు పేర్కొన్నారు. వెంటనే కొమరన్నను అరెస్టు చేశామని కోర్టుకు రిమాండ్‌కై కోర్టుకు పంపనున్నట్లు తెలిపారు.

## దేశంలో బిజేపి,ప్రధాని మోదీ హవా...

ఇల్లందు,అర్బన్,ఫిబ్రవరి, ప్రభాతవార్త27:

దేశంలో బిజేపి గాలి వీస్తుందని ఏ రాష్ట్రానికి వెళ్ళిన ముచ్చటగ మూడోసారి కేంద్రంలో బిజేపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించనుందని ప్రజలు బిజేపి నాయకులు,అభిమానులు చర్చించుకున టున్నట్లు బిజేపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమ్‌చందర్‌రెడ్డి నాయకులు అన్నారు.బిజేపి విజయ సంకల్ప యాత్ర మంగళవారం రాత్రి ఇల్లందు చేరకుంది. కరెంటాఫీసు నుంచి జగదాంబ సెంటర్ వరకు కొనసాగింది.అనంతరం ఇల్లందు బిజేపి నియోజకవర్గం కన్వీనర్ గోపికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బిజేపి నాయకులు మాట్లాడుతూ,దేశానికి గత పదేళ్లుగా అవినీతి రహిత పాలనను అందించిన ఘనత బిజేపికే ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు.ఇదే తరహా పాలన మరో ఐదేళ్ళు కొనసాగాలని దేశ ప్రధానిగా మూడో సారి ఎన్నిక కావాలనిప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు.బిజేపి వివిధ రంగాల్లో తీసుకోని వస్తున్న సంకరణలు,మార్పులు అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్,వివిధ రాష్ట్రాల్లోఉన్న చిన్నచితక ప్రాంతీయ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నరని ఆరోపించారు.జాతీయ పార్టీగా చెప్పకుంటున్న కాంగ్రెస్ ఇండియా కూటమితో బిజేపిని ఓడించాలని చూస్తే కూటమి ఏర్పడిన మూడునాళ్లకే ముక్కలు చెక్కలు అయిందన్నారు.ఇదిఇలా ఉండగ రాష్ట్రంలో అబద్దాల పాలన కొనసాగిస్తున్నకాంగ్రెస్,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయటంలో విఫలం చెందారన్నారు.అమలుకు సాధ్యం కాని హామీలుఇచ్చి కాలయాపన చేస్తున్నట్లు ఆరోపించారు.అదికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టు పై విచారణ చేయిసామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అదిశగా చర్యలు తీసుకోవటం లేదన్నారు.అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ బిఆర్ఎస్ ఒక్కటయ్యాయన్నారు.ఏది ఏమైన దేశంలో బిజేపి మూడో సారి అదికారంలోకిరాబోతుందని,రాష్ట్రంలో ఈ సారి 5నుంచి10 గెలుచుకోనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో బిజేపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రంగకిరన్,నాళ్ళ సోమసుందర్,బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,యాప సీతయ్య,మహేష్,మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు



పాల్వంచ అర్బన్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:

పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన రెండు గ్యారెంటీలైన మహాలక్ష్మీ పథకంలోని 500 రూపాయల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల గృహజ్యోతి ఉచిత విద్యుత్ ప్రారంభించిన సందర్భంగా సంతోషంగా సంఘీభావంగా పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాకల రంగారావు ఆధ్వర్యంలో ఇందిరాకాలనీలోని ఇందిరాగాంధీ విగ్రహం వదనద పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు అయితా గంగాధర్, కొమరాజు విజయ్, ఆవుల మధు, భరత్, బబ్లూ, ఆది ప్రశాంత్, రాపోలు ఆనంద్, ఒలపల్లి రాంబాబు, సాంబయ్య, లక్ష్మీరెడ్డి, అనీత, మౌనిక పాల్గొన్నారు.

## ప్రజాపంథా పార్టీలో చేరికలు



పాల్వంచ అర్బన్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:

మండలంలోని పునుకుల గ్రామంలో 20 మంది సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రజాపంథా పార్టీ జిల్లా నాయకులు నిమనమల రాంబాబు మాట్లాడుతూ... నేడు రాజకీయాలు కొందరి స్వార్థం కోసం, స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ ప్రజలను పక్కదోవ పట్టించి వ్యవస్థలో ప్రజలకు సమన్యాయం జరగకుండా చేస్తూ దోపిడీ దారుల అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, పేద, మధ్యతరగతి, సామాన్యులు అనేక సమస్యలతో సతమతమవుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారికి ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ పాల్వంచ పట్టణ కార్యదర్శి రాయబారపు వెంకటేశ్వర్లు, పగిడిపల్లి సంజీవరావు, రామారావు, బొల్లం కోటయ్య, లింగయ్య, ఎలమంచి వినోద్, హనుమంతు, లింగస్వామి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులను సన్మానించిన సీఈ



పాల్వంచ అర్బన్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:

ఇటీవల విజయవాడలో జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన కేటీపీఎస్ ఉద్యోగుల కుమార్తెలను సీఈ ఎం.ప్రభాకర్‌రావు అభినందించి సన్మానించారు. ఎస్టాఫ్ ఆపరేటర్ బి.శ్యాంకుమార్ కుమారెనత దీప్సిక, ప్రసాదరావు కుమార్తె దీపా హస్మితలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు వెంకటేశ్వర్లు, రామారావు, వెల్ఫేర్ ఆఫీసర్ రాధాకృష్ణలు పాల్గొన్నారు.




## ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా వాకథాన్



పాల్వంచ అర్బన్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 2కె వాకథాన్ కార్యక్రమాన్ని డీఈవో వెంకటేశ్వరచారి జెండా ఊపి ప్రారంభించారు.ఈ వాకథాన్ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల పాల్వంచ నుంచి దమ్మపేట రోడ్ మీదుగా కొనసాగింది. మేలుకో మేలుకో ఓ కస్టమర్ మేలుకో... తెలియని లింకులు నొక్కొద్దులు... ఓటీపీలు చెప్పొద్దు, ఆర్థిక మోసం జరిగిందా... వెంటనే ఫోన్‌చెక్ 1903... లాంటి ఆలోచనాత్మక నినాదాలతో ఈవాకథాన్ జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు నాగరాజశేఖర్, సైదులు, ఎల్‌డీఎం రామిరెడ్డి, హెచ్ఎంలు బుచ్చిరాములు, ఎస్‌బీఐ మేనేజర్లు రాజబాబు, బాలకృష్ణ, జగన్, రాజేందర్, దిలీప్ శుక్లా పాల్గొన్నారు.

## పాల్వంచ శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా ఫ్యామిలీ ఫెస్ట్

పాల్వంచ అర్బన్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:

పాల్వంచ పట్టణానికి చెందిన కాంట్రాక్టర్స్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా ఫ్యామిలీఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ... తమ పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలు చూపాలని, సేవా భావాన్ని పెంపొందించుకోవాలని, పెద్దవారిని గౌరవిస్తూ తల్లిదండ్రులు కలలను సాకారం చేసే విధంగా చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ నాగేశ్వరరావు, ఇంచార్జి నాగబాబు, ప్రైమరీ ఇంచార్జి వర్ధిని, ప్రీ ప్రైమరీ ఇంచార్జి శిరీష,





తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరుగ్యారెంటీలలో బాగంగా ఉచిత కరెంట్, రూ.500కే గ్యాస్ పథకాలను మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన సందర్భంగా మహిళల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున్‌ఖర్గే, ప్రియాంక గాంధీతో కూడిన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100రోజుల లోపే మాటతప్పకుండా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్‌రావు, టిపిసిసి మెంబర్ జాని, బోళ్ల సూర్యం, మడుగు సాంబమూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పరీక్షలు మంచిగా రాయండి

**- మీకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది...**

**- మనస్ఫూర్తిగా బెస్ట్ విషెస్ తెలియజేసిన కలెక్టర్ ప్రియాంక అల**



కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:

విద్యార్థులు పరీక్షలు మంచిగా రాయండి... మీకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మనస్ఫూర్తిగా బెస్ట్ విషెస్ తెలియజేస్తున్నానని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. బుధవారం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులకు విషెస్ తెలిపారు. ఉజ్వల భవిష్యత్తు పునాది చేసే ఈ పరీక్షలు మీరు ప్రశాంతంగా రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురి కావొద్దని, భయపడవద్దని, నిర్భయంగా, ధైర్యంగా పరీక్షలు రాయాలని అన్నారు. ఒత్తిడికి గురయ్యే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు, భయాన్ని పోగొట్టేందుకు ప్రత్యేకంగా 14416 టెలీ మానస్ టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టెలీ మానస్‌కు కాల్ చేస్తే నిపుణులైన మానసిక వైద్యులు ఉచిత కౌన్సిలింగ్ సేవలు అందిస్తారని చెప్పారు. టెలీ మానస్‌కు కాల్ చేస్తే నిపుణులైన మానసిక వైద్యులు ఉచిత కౌన్సిలింగ్ సేవలు అందిస్తారని చెప్పారు. అలాగే ఏదైనా సలహాలు, సూచనలు కోసం రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన 040-24601010, 040-24655027 నంబర్లకు కానీ, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన 7997994366, 8919961913, 9441817478 నంబర్లకు సంప్రదించాలని చెప్పారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండాచూడాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, అదే విధంగా విధులు నిర్వహించే సిబ్బంది, ఎవరికీ సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లడానికి అనుమతి లేదని ఆమె స్పష్టం చేశారు.



# పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుంది

**-మణుగూరు ఏరియా ఎస్వోటూ జీఎం వీసం కృష్ణయ్య**

మణుగూరు, ప్రభాతవార్త, ఫిబ్రవరి 27 :

పదోన్నతి బాధ్యతను మరింతగా పెంచుతుందని మణుగూరు ఏరియా ఎస్వోటూ జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. ఆయన మంగళవారం మణుగూరు ఏరియా పీకేఓసీ-2 బేస్ వర్క్‌షాపు నందు కొత్తగూడెం రీజియన్ స్థాయిలో విధులు నిర్వహిస్తున్నన ఏ గ్రేడ్ ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తి పరంగా పదోన్నతి పొందిన వారు సంస్థ పురోగతికి పాటుపడాలన్నారు. మణుగూరు, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లందు ఏరియాలో పని చేస్తున్న మూడు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకుని దరఖాస్తు చేసుకున్న ఏ గ్రేడ్ ఆపరేటర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని మౌళిక, ప్రాక్టికల్ టెస్టులు పెట్టామని ఈ నెల 28న ఇంటర్వ్యూల ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆయా ఏరియాల అధికారులు జి.వెంకటమోహన్‌రావు, రవీందర్, దాసరి రాజశేఖర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, సింగు శ్రీనివాస్, బుర్రా వెంకటేశ్వర్లు, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# వైభవోపేతంగా రామయ్య కళ్యాణం

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి కళ్యాణం కన్నులపండుగగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నది తీరం నుండి తీర్థపు బిందెలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ నది జలాలను తీసుకుని శ్రీస్వామి వారి మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకస్వాములు ముందుగా శ్రీస్వామి వారి సహస్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహాత్యాన్ని భక్తులకు వివరించారు. కళ్యాణతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోక్త్రధారణ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంగళాష్టకాలు, చూర్ణిక, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్యధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణం జరుగుతున్నంత సేపు కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కన్నులారా శ్రీసీతారామచంద్రస్వామి వార్లను చూస్తూ తరించిపోయారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలకు తన్మయత్వంతో పులకరించిపోయారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థాన సిబ్బంది కళ్యాణలడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.



# ఇండియా - బంగ్లాదేశ్ ఫ్రెండ్‌షిప్ క్యాంప్‌లో సింగరేణి స్కౌట్స్ అండ్ గైడ్స్



కొత్తగూడెం, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:

2వ ఇండియా - బంగ్లాదేశ్ ఫ్రెండ్‌షిప్ క్యాంప్‌లో తెలంగాణ రాష్ట్రం తరపున సింగరేణి స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాతినిధ్యం వహించినట్లు జీఎం పర్సనల్ బసవయ్య తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బంగ్లాదేశ్ స్కౌట్స్ సంయుక్తంగా ఈ నెల 26 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ జిల్లా కుర్సియాంగ్‌లో నిర్వహించే 2వ ఇండో - బంగ్లా స్కౌట్ స్నేహ శిబిరంలో తెలంగాణ రాష్ట్రం తరపున జీఎం పర్సనల్ బసవయ్య ఆధ్వర్యంలో సింగరేణి సంస్థ ప్రాతినిధ్యం వహిస్తుందని అన్నారు. జీఎం పర్సనల్ బసవయ్య మాట్లాడుతూ... సింగరేణి సంస్థ ఈ క్యాంపు కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించిందని అన్నారు. సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్ నుంచి



రాజ్యపురస్కార్‌కి అర్హత సాధించిన 11 మంది స్కౌట్స్, 3 యూనిట్ లీడర్లను తెలంగాణ రాష్ట్రం తరపున రెండవ బంగ్లాదేశ్ ఫ్రెండ్‌షిప్ క్యాంపులో భారత్ నుంచి దాదాపు 200 మంది, బంగ్లాదేశ్ నుంచి 250 మంది పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం, సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ సుశీల కుమార్, యూనిట్ లీడర్లు, సింగరేణి ఎయిడెడ్ పాఠశాల, కొత్తగూడెం, గోలేటి, మాస్టర్ ఈకే విద్యాలయం, శ్రీశారద విద్యాలయం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల వార్షిక పర్యవేక్షణ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత అధికారుల సూచనల మేరకు కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం ప్రభుత్వ హైస్కూల్ పరిధిలోని 2 ఇంక్లైన్ ప్రభుత్వ పాఠశాలను నోడల్ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ మంగళవారం సందర్శించారు. అకాడమిక్ రికార్డులను పరిశీలించారు. విద్యా ప్రమాణాల



మెరుగుదలకై పలు సూచనలు చేశారు. ప్రాథమిక విద్యాస్థాయిలోనే విద్యా సామర్థ్యాలు పెంచగలిగితే తదుపరి స్థాయిల్లో విద్యార్థులు సులభంగా, ఉత్సాహంగా రాణిస్తారని తెలిపారు.

# స్వచ్ఛంద ప్రజా సేవా చేసే సంస్థలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది

**-భద్రాద్రి దేవస్థానానికి పూర్వవైభవం తీసుకొస్తాం .. అభివృద్ధి చేసి చూపిస్తాం**

**-మల్లు నందిని విక్రమార్క**

భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :



స్వచ్ఛందంగా ప్రజా సేవ చేసే వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు సహకరిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నందిని విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం శ్రీనిధి రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన గ్లోబల్ హ్యూమానిటేరియన్ మిషన్ వ్యవస్థాపకులు సద్గురు మధుసూదన్ సాయి స్విరిచువల్ స్పీచ్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బడికి వెళ్తున్న విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని సద్గురు మధుసూదన్ సాయి ట్రస్ట్ వారు ప్రారంభిస్తున్నారని, దానికి 50 శాతం నిధులు తెలంగాణ ప్రభుత్వం భరించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల దృష్టికి తీసుకుని వెళ్తానని ఆమె తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో రూ.25లక్షల మంది బాలలకు పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. అదేవిధంగా భద్రాచలం పుణ్యక్షేత్రం ప్రభావం కోల్పోతుందని భవిష్యత్తులో దేశం మొత్తం చర్చించుకునేలా అభివృద్ధి చేస్తామని ఆమె అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 33 దేశాలలో సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి సద్గురు మధుసూదన్ సాయిని ఆమె అభినందించారు. అదేవిధంగా కార్యక్రమ నిర్వాహకులు వంగల శేషాద్రిని, వేణుమాధవ్, గొట్టిముక్కలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఉపప్రధానార్చకులు కోటి రామస్వరూపాచార్యులు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపి వేదాశీర్వచనం తీసుకున్నారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు జరగనున్న పరీక్షలు**

**70సెంటర్లు, మొత్తం 36,578మంది విద్యార్థులు**

**ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 18,481**

**సెకండీయర్ విద్యార్థులు 18,087మంది**

**నిమిషం ఆలస్యమైనా "నో ఎంట్రీ"**

**డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లకు అనుమతి**

**పరీక్షా సెంటర్ల వద్ద 144సెక్షన్**



ఖమ్మం,ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ః

ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు మార్చి 16వ తేదీ కొనసాగనున్నాయి. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ. జిల్లాలో 70పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 131 జూనియర్ కళాశాలలకు చెందిన 36,578 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 18,481మంది హాజరు కానుండగా, ఇంటర్ సెకండీయర్ విద్యార్థులు 18,097 మంది హాజరు కానున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాటు ఏసింది. హాల్ టికెట్లు ఆయా కళాశాలల నుండి పొందిన హాల్ టికెట్లతో పాటు ఎవరైనా విద్యార్థులు ఇంటర్‌నెట్ ద్వారా హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకున్నా కూడా ఎటువంటి సంతకాలు లేకున్నా కూడా వాటిని అనుమతిస్తామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె రవిబాబు స్పష్టం చేశారు. కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజులు చెల్లించకుండా ఉన్న విద్యార్థులను యాజమాన్యం ఇబ్బందులు పెట్టినట్లయితే ఎటువంటి డబ్బులు చెల్లించకుండానే ఇంటర్నెట్ సహాయంతో డౌన్ లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై ప్రిన్సిపల్, లేదా కళాశాల యాజమాన్యం సంతకాలు లేకున్నా కూడా అనుమతిస్తామని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్షలకు పరీక్షా సెటర్ల వద్ద 144సెక్షన్ విధించారు. పటిష్టమైన పోలీస్ బందోబస్తు నడుమ పోలీస్ స్టేషన్ల నుండి ఆయా పరీక్షా సెంటర్లకు ప్రశ్నా పత్రాలు తరలించనున్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా సెంటర్లకు దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయనున్నారు. ఉదయం 9గంటల నుండి జరగనున్న ఈ పరీక్షలకు విద్యార్థులు గంట ముందే పరీక్షా సెంటర్లకు చేరుకోవాల్సి ఉంటుంది. ఖమ్మం నగరంలో 38సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆయా సెంటర్లలో పరీక్షలు రాసినటువంటి విద్యార్థులకు ట్రాఫిక్ సమస్య తలెత్తె ప్రమాదం ఉంది. ముందు జాగ్రత్త చర్యగా వారు ప్రయాణించే వాహనాలు ట్రాఫిక్ లేని ప్రాంతం నుండి ప్రయాణించి సకాలంలో గంట ముందే ఆయా సెంటర్లకు చేరుకునే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవడం మంచిది. పరీక్షా హాల్‌లోకి ఎటువంటి ఎలక్ట్రికల్ పరికరాలకు అనుమతి లేదు. పరీక్షా సెంటర్ల వద్ద త్రాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఈ సారి అన్ని పరీక్షా హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో ఎటువంటి అవకతవకలు పాస్ కాఫీలకు తావు లేకుండా పటిష్టమైన స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ పరాక్షలు రేపటి నుండి 19వ తేదీ వరకు కొనసాగనుండగా, జిల్లాలో మాత్రం మార్చి 16వరకు జరగనున్నాయి. 18,19వ తేదీలలో మోడల్ ల్యాంగేజ్ సెబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు జరగనున్నాయి. ఎటువంటి ఒత్తిడి లేకుండా సక్స్‌స్ ఫుల్‌గా విద్యార్థులందరూ పరీక్షలు రాయాలని, వారందరికీ "ప్రభాతవార్త" బెస్ట్ విసెష్ తెలిపారు.






## బీజేపీ విజయసంకల్ప యాత్రకు ఎమ్మార్పీఎస్ సంఘీభావం

ఖమ్మం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ః

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ నిర్వహిస్తున్న విజయసంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఉన్న ఖమ్మం జిల్లా కేంద్రానికి యాత్ర చేరుకున్నది. ఈ యాత్రకు ముఖ్య అతిథులుగా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే విచ్చేసిన సందర్భంగా ఖమ్మం జిల్లా ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్, నాయకుల బృందం కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తూరుగంటి అంజయ్య మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ ఎంఎస్‌పి జాతీయ నాయకులు మాచర్ల క్రాంతి మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి ఎంఎస్‌పి ఖమ్మం నగర అధ్యక్షులు బాకీ శ్రీను మాదిగ, ఎంఎస్‌పి జిల్లా నాయకులు దుడ్డేలా సైదులు మాదిగ, ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్ ఖమ్మం నగర నాయకులు సూరేపల్లి నాగేశ్వరరావు, గుర్రం వీరన్న, రాయబారపు ఉపేందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ క్యాడర్‌లో నూతన నాయకుల నియామకం



ఖమ్మం కార్పొరేషన్ ప్రభాతవార్త:

మంగళవారం సంజీవరెడ్డి భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యుఐ జనరల్ సెక్రెటరీగా ఆకాష్ నాయుడు, ఎన్ఎస్‌యుఐ టౌన్ అధ్యక్షులుగా పేరం యశ్వంత్ వర్ధన్, ఎన్ఎస్‌యుఐ జిల్లా కోఆర్డినేటర్‌గా నితిన్‌ని నియమించడం జరిగింది. అందేవిధంగా వారిని సన్మానిస్తూ రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ విద్యార్థులకు అండగా నిలవాలని, విద్యార్థుల సమస్య పట్ల వెంటనే స్పందించాలని, వారికి ఉత్తర్వులు జారీ చేయడం చేస్తూ జాయిన్ ఎన్ఎస్‌యుఐ లోగోని ఆవిష్కరించారు. అదేవిధంగా మున్సిపాలిటీ అధికారుల తీరుని ఖండిస్తూ ఖమ్మం నగరంలోని సెంచరీ స్కూల్ పక్కనున్నటువంటి దుకాణంలో సిగరెట్, మందు లాంటివి అమ్ముతున్నారని తెలిసి వాటిని వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జావిద్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేగినాటి ఉదయ్, ఖమ్మం జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు హుస్సేన్, కమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్మన్ ఆదర్శ్ నాయుడు, నగర కార్పొరేటర్ సైదులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాస్, ఈశ్వర్, ఫారుక్ పాల్గొన్నారు.

## నాడు మాట ఇచ్చారు నేడు నెరవేర్చారు



**- హామీ నిలబెట్టుకున్న తుమ్మల**

**- పక్షం రోజుల్లో దాహార్తికి పరిష్కారం**

**- వేపకుంట్లలో హార్స్‌పవర్ ఏర్పాటు**

రఘునాథపాలెం ప్రభాతవార్త, ఫిబ్రవరి 27:

ఖమ్మం నియోజకవర్గ కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్నటువంటి వేపకుంట్ల గ్రామస్థులు త్రాగటానికి నీటి ఎద్దడి ఏర్పడి అల్లాడుతున్నారు. పక్షం రోజులక్రితం గ్రామస్థులందరూ నీటి సమస్యను తీర్చాలని కోరుతూ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆశ్రయించి వినతి పత్రాన్ని అందచేశారు. మంగళవారం రఘు నాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో నాడు మంత్రి తుమ్మల ఇచ్చిన హామీ నెరవేరుస్తు సంబంధిత అధికారులతో మాట్లాడి 7.5 హార్స్‌పవర్ బోరును డ్రిల్లింగ్ చేసి దానికి అవసరమగు పైపులను సైతం



అమర్చారు. గత కొన్నిరోజులుగా అ గ్రామంలో త్రాగునీటి ఎద్దడి నెలకొంది. తన నియోజకవర్గంలో వేసవికి ముందే ఈ సమస్య తలెత్తడంతో తక్షణ సమస్యగా భావించిన మంత్రి కేవలం 15రోజుల వ్యవధిలోనే త్రాగునీటి ఇబ్బందిని తొలగించారు. వేపకుంట్ల గ్రామ ప్రజలు అడిగిన వెంటనే దాహార్తి తీర్చిన మంత్రికి రుణపడి ఉంటామని మాజీ సర్పంచ్ బండి నాగేశ్వరరావు, యస్‌సి సెల్ అధ్యక్షుడు అరివికట్ల ప్రేమ్‌కుమార్, గ్రామ ప్రముఖులు ఉప్పెర్ల రామయ్య, చల్లగుండ్ల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి మేయర్ కసరత్తులు

ఖమ్మం కార్పొరేషన్ ప్రభాతవార్త:





రాబోయే వేసవి కాలన్ని దృష్టిలో ఉంచుకొని నగర మేయర్ పునుకొల్లు నీరజ ఇంజనీరింగ్ సిబ్బందిని వెంట పెట్టుకొని నగరంలోని బావులు, బోర్స్‌ను పరిశీలనలో భాగంగా మంగళవారం 41వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ డివిజన్‌లోని లకారం చెరువు అలుగుల వద్ద ఉన్న 150 సంవత్సరాల క్రితం నుండి ఉన్న అలుగు బావిని పరిశీలించి డివిజన్‌లోని బోర్స్‌ను పరిశీలించారు. అలుగు బావి గతంలో స్థానిక ప్రజలు త్రాగు నీరుగా కూడా ఉపయోగంలో ఉండేదని, ప్రస్తుతం ఈ బావుని ఎవరు వాడక పూడికతో చుట్టు రక్షణ గోడలు పడి, పిచ్చి చెట్లు పెరిగాయని పేర్కొన్నారు. మేయర్ నీరజ, ఏజీ జ్యోతిని ఈ బావి త్వరగా పూడిక తీయించి, చుట్టు రక్షణ గోడలు రిపేరు చెయించి వాడకంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఫిబ్రవరి నెలలోనే ఎండలు బాగ పెరిగి ఇప్పటికే గ్రౌండ్ వాటర్ లెవెల్స్ తగ్గాయని, భవిష్యత్‌లో నీటి అవసరం చాలా ఉంటాయని, అందుకే ప్రజలు ఇబ్బంది పడకుండా నగరంలో పని చేయని బోర్స్ అన్నింటిని రిపేర్ చేయించి కొత్త సామనులు అమర్చలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్, బోర్స్ రిపేర్ ఇంచార్జి యాదగిరి పాల్గొన్నారు.




## సుంకరి ముత్తయ్య మృతి తీరని లోటు

### బిజెపి మండలాధ్యక్షుడు ధూళిపూడి

పినపాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త



మండల పరిధిలోని దుగినేపల్లి గ్రామానికి చెందిన సుంకర ముత్తయ్య అనారోగ్య కారణంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు దూళిపూడి శివప్రసాద్ ఆయన కుటుంబ సభ్యుల్ని కలిసి పరామర్శించి ముత్తయ్య మృతి పట్ల సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుగినేపల్లి గ్రామానికి చెందిన సుంకర ముత్తయ్య గతంలో ప్రజాప్రతినిధిగా ఎన్నికై గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. ప్రజలందరికి ఎపుడు అందుబాటులో ఉంటూ పంచాయతీ వార్డు సభ్యులుగా, గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎంపిటిసిగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అశ్వాపురం,ఫిబ్రవరి27,ప్రభాతవార్త.



అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 28నేటి నుండి నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఎన్ సత్యప్రకాష్ తెలిపారు.పరీక్షలు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటలవరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 81మంది,ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 109మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని,ఒక నిమిషం ఆలస్యమైన విద్యార్థులను పరీక్ష హాలులోనికి అనుమతించబోమని,పరీక్ష కేంద్రానికి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా గరుడాచలం వ్యవహరిస్తారని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కళాశాల చుట్టుప్రక్కల 144సెక్షన్ అమలులో వుంటుందని తెలిపారు.పరీక్ష కేంద్రంలో అన్ని వసతుల ఏర్పాట్లకు సహకరించిన వైద్య రెవెన్యూ పంచాయతీరాజ్ పోలీస్‌శాఖ ఇతర శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీసు స్టేషన్ సందర్శించిన డిఎస్‌పి

పినపాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

మండల పరిధిలోని ఇ.బయ్యారంలో గల పోలీసు స్టేషన్‌ను మణుగూరు డిఎస్‌పి వంగా రవీందర్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె.శివప్రసాద్‌ను ఇ.బయ్యారం సర్కిల్ పరిధిలోని కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.




# పనిభారంతో కార్యదర్శులు సతమతం

**సంక్షేమ పథకాలు దరఖాస్తుల నుంచి ఎంపిక వరకు పూర్తి బాధ్యత వారిదే**

**అధికారులకు ప్రగతి నివేదికలు అందజేయడం**

**పంచాయతీలో అంతా తానేగా పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు**

**పని భారం తగ్గించాలని, కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి**

పినపాక, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రజాసంక్షేమ పథకాల అమలులో స్థానిక ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమైంది. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు పారిశుధ్య పనుల నిర్వహణలో భాగంగా ఇంటింటికి తిరిగి తడిపొడి చెత్త సేకరణతో విధులు మొదలు సాయంత్రం ఉద్యోగ బాధ్యత ముగింపు ఆ రోజు అధికారులు అప్పగించిన పనిని బట్టి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాభివృద్ధి కోసం నిరంతరం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలలో లబ్దిదారుల ఎంపిక వరకు పూర్తి బాధ్యతగా ఉంటూ పంచాయతీల్లో అంతా తానే ప్రజలకు పథకాలను అందజేయడంలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్య భూమిక పోషిస్తారనేది వాస్తవం. తమకు అప్పగించిన విధుల్లో భాగంగా పంచాయతీల్లో ప్రతిరోజు చెత్తను సేకరించడం, పంచాయతీ సిబ్బందికి రోజువారికి సంబంధించిన విధులు అప్పగించడం ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు అందజేయడం, వరద విపత్తు సమయంలో బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి కావాల్సిన నిత్య అవసరాలతో పాటు వసతి, సౌకర్యాలు ఏర్పాటు చేయడం, సీజన్ వ్యాధులు ప్రబలకుండా విధిగా పంచాయతీల్లో బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు మందుల పిచికారి చేయించడం, పంచాయతీలోని అంతర్గత రహదారులపై కేజీవీల్స్ ట్రాక్టర్లు తిరగకుండా నిరంతరం పర్యవేక్షించడం, ఇంటి పన్నులు వసూలు చేయడం, విద్యుత్ మీటర్లకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందజేయడం, పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఎన్ఆర్ఈజిఎస్ పనుల పర్యవేక్షణ, పాలకవర్గం ఫోరంతో గ్రామసభల నిర్వహణ ప్రజా అవసరాలకు సంబంధించి చేయవలసిన పనుల తీర్మానాలు చేయడం, ప్రజలకు తాగునీరు ఇబ్బందులు కలగకుండా చేయడం డంపింగ్ యార్డుల నిర్వహణ, పల్లె ప్రకృతి వనాల సంరక్షణ, పంచాయతీ పరిధిలోని మురుగునీటి నిల్వలు లేకుండా డ్రైనేజీ మరమ్మతులు పనులు చేపట్టడం, విద్యుత్ సరఫరాకు అసౌకర్యం కలకుండా చెట్లను తొలగించడం, వీధి లైట్ల ఏర్పాటు, పంచాయతీలోని ప్రజల జనన, మరణ నమోదు ప్రక్రియ, సీజన్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, వైద్యుల సౌకారంతో పంచాయతీలో వైద్య శిబిరాలు ఏర్పాటు, మంచినీటి పైపుల లీకేజీ మరమ్మతులు వాటర్ ట్యాంకుల క్లీనింగ్, ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూడడం, వారం మధ్యలో మండలస్థాయి అధికారులు నిర్వహించే ప్రత్యేక సమావేశాల్లో పాల్గొనడం సమావేశానికి సంబంధించిన నివేదికలు తయారు చేయడం, సమర్పించడం, ఇంటింటికి తిరిగి మరుగుదొడ్లపై, ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పించి లక్ష్యాలను పూర్తి చేయడం, పంచాయతీ ట్రాక్టర్ల పనితీరును పరిశీలించడం, ట్రాక్టర్‌కు కావల్సిన డిజీల్ సమకూర్చడం, పంచాయతీల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ ఇలా ఎన్నో పనులు చేస్తూ పంచాయతీ సిబ్బందితో పనులు చేయించుతూ పంచాయతీల అభివృద్ధికి ఎన్నో రకాలుగా సేవలు అందిస్తూ చాలిచాలని, సమయానికి రాని జీతాలతో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. నాటి తెలంగాణ టిఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా క్షేత్రస్థాయిలో సమూల మార్పులు తీసుకు రావడం వలన వారి పనిని సైతం కార్యదర్శులకు అప్పగించడం వలన కార్యదర్శులకు మరింత పనిభారం పెరిగింది. తప్పక తప్పించుకోలేక చేస్తున్న తమ విధుల్లోని కొంత భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ముఖ్యంగా మహిళా కార్యదర్శులపైన పేర్కొన్న విధులను ప్రవర్తించే క్రమంలో ప్రత్యక్షంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది. విధి నిర్వహణలో ఖచ్చితమైన ముగింపు సమయ పాలన లేకపోవడంతో విధి నిర్వహణలో మహిళా కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు.

**కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి : జక్కుల ఆశోక్**



తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను (ఓపిఎస్) క్రమబద్దీకరించి పేస్కేల్ వర్తింప చేయాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహించి రెగ్యులర్ అయిన వారందరికీ మానిటరి బెనిఫిట్స్ ఉద్యోగంలో చేరిన తేదీ 12-04-2019 నుంచి సర్వీస్ కాలంలో వర్తించేలా సంబంధిత ఉత్తర్వులు జారీ చేయాలని డిగ్రీ అర్హతతో ఉద్యోగంలో చేరిన పంచాయతీ కార్యదర్శులు సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తింపచేయగలని, విధి నిర్వహణలో చనిపోయిన జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు తగిన భద్రత కల్పించాలని అదేవిధంగా విధి నిర్వహణలో సమయ పాలనతో పాటు సెలవు దినాల్లో విధులు మినహాయింపు అందించడంతో మరికొన్ని డిమాండ్‌లతో రాష్ట్ర పంచాయతీ రాజ్ మాత శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను పంచాయతీ కార్యదర్శుల సంఘం మెమోరాండం ఇప్పటికే అందజేశారు. తెలంగాణలో ఏర్పడిన ప్రజాపాలన ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల ఇబ్బందులను సమస్యలను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ ఆశిస్తున్నా

**-ఆదివాసీల అస్తిత్వ ప్రతీక మహబూబాబాద్**

**-మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర**

మణుగూరు, ప్రభాతవార్త, ఫిబ్రవరి 27 :



ఆదివాసీ ఓటర్లు అధికంగా ఉన్న మహబూబాబాద్ ఎంపీ స్థానం ఆదివాసీలకే కేటాయించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర కాంగ్రెస్ అదిష్టానాన్ని కోరారు. ఆయన మంగళవారం మణుగూరు పట్టణంలోని డీవీ రాయల్‌గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబాబాద్ ఎంపీ స్థానం ఆదివాసీల అస్తిత్వ ప్రతీక అని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో అత్యధికంగా ఎమ్మెల్యే స్థానాలకు ఆదివాసీలు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో ఎంపీ స్థానం కూడా ఆదివాసీలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అన్ని నియోజకవర్గాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉందని సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన ఉందని ఆయన అన్నారు. తాను గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చేసిన కోట్ల రూపాయల అభివృద్ది ఎంపీగా గెలిపిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ఎంపీగా గెలిస్తే మణుగూరు, రామగుండం రైల్వే లైన్ గట్టిగా కృషి చేసి సాధిస్తానని అన్నారు. కాంగ్రెస్ అదిష్టానానికి ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే ధరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. తన అభ్యర్ధన పట్ల అధిష్ఠానం సానుకూలంగా స్పందిస్తు ందన్న విశ్వాసం ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, నామా వెంకటేశ్వర రావులు పాల్గొన్నారు.



# విప్లవ పార్టీల విలీన సభను జయప్రదం చేయండి : ప్రజాపంథా

### మండలంలో విస్తృతంగా ప్రచారం

*గుండాల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :*

మార్చి 3న ఖమ్మంలో జరిగే విప్లవ పార్టీల విలీన బహిరంగసభను ప్రజలు, మేధావులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఇల్లెందు డివిజన్ కార్యదర్శి ఈసం శంకరన్న, మండల కార్యదర్శి కొమరం శాంతయ్య, పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్‌లు అన్నారు. మండలంలోని ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే యూనిటీ బహిరంగసభ, ప్రజా ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ మండ పరిధిలోని కొడవటంచ, నడింగూడెం, మేద్గులగూడెం, తూరుబాక, ముత్తాపురం, గలబ, వెన్నెలబైలు, గొర్కల మడుగు, శెట్టుపల్లి, రేగులగూడెం గ్రామాలలో మంగళవారం వాల్‌పోస్టలు వేస్తు, కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రూప్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లడుతూ కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ కులమతాలను రెచ్చగొడుతుందని మణిపూర్‌లాంటి సంఘటనలు దీనికి ఉదాహరణగా నిలిచాయన్నారు. ఈ సారి మళ్ళీ



ఎన్నికలు సమీపిస్తున్న నేపధ్యంలో మరోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ కాబడుతుందని అన్నారు. బడాకార్పోరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు వత్తాసు పలుకుతూ బిజేపీ, ఆర్‌యస్‌యస్ శక్తులను రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

పిసిసి సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ ఆర్ఐ, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా మూడు విప్లవ పార్టీలు ఒకే పార్టీగా మార్చి 3వ తేదీన ఖమ్మం పట్టణంలో భారీ బహిరంగసభ నిర్వహించి ఐక్యమౌతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలో వేలాది మందితో భారీ ప్రజాప్రదర్శన నిర్వమిస్తున్నామని అన్నారు. బహిరంగసభ విజయవంతం చేయడానికి ప్రజలు అధికసంఖ్యలో ఖమ్మం తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తెల్లం రాజు, పూనెం మంగయ్య, మోకాళ్ళ అజాద్, ఈసం కృష్ణ, ఈసం సింగన్న, రియాజ్, కొమరం రంగన్న, పూనెం లక్ష్మయ్య, కోడూరి జగన్, వజ్జ ధర్మరాజు, ఊకె శ్రావన్, లక్ష్మనారాయణ, సుధాకర్, మోహన్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందులో ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్దం

### -ఫస్ట్‌ఇయర్‌లో 1133 మంది పరీక్షలు రాయనున్నారు
### -నాలుగు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

*ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త:*

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఇల్లెందులో ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం మొదటి సంవత్సరం పరీక్షలకు మొత్తం 1133 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వనున్నారు. పరీక్షలకు సంబందించి ఇల్లెందులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీఆర్ సుధిమళ్ల, సాహితి, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు సంబందించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామలింగేశ్వర్‌రావు తెలిపారు. విద్యార్థులకు నిర్ధేశించిన సమయం కంటే ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



విద్యార్థులు నిమిషం ఆలస్యమైన ఇంటర్మీడియ్ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పరీక్షా కేంద్రంలోకి ఆనుమతించబడరని ఈ విషయాన్ని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని తెలిపారు. విద్యార్థులు తమ వెంట సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రికల్ వస్తువులను తీసుకురావద్దని సూచించారు. పరీక్షాహాల్‌లో ఎటువంటి మాస్‌కాఫియింగ్‌కు ఆస్కారం ఉండదని ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేయడం జరుగుతుందని అన్నారు. పరీక్షల్లో ఎటువంటి మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా ప్రత్యేక ఫ్లైయింగ్ స్కాడ్‌లను అధికారులు



నియమించారని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను సైతం అనుమతి ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు పరీక్షా హాల్‌లు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తప్పకుండా సమయపాలన పాటించి పరీక్షలకు హాజరుకావాలిన విజ్ఞప్తి చేశారు.

# సంత్ సేవాలాల్ మార్గంలో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే కోరం

*ఇల్లెందు, ప్రభాతవార్త:*

సంత్ సేవాలాల్ మహారాజ్ చూపించిన మార్గంలో బంజారాలతో పాటు అందరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల ముగింపు వేడుకలను సింగరేణి హైస్కూల్ క్రీడామైదానంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ ప్రియాంక అల పాల్గొన్నారు. ముందుగా బంజారాల సంస్కృతి సంప్రదాయాల నృత్యాలతో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోగ్‌బండార్, వింతి కార్యక్రమాలను అతిథులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్



ఆదర్శపురుషుడని జాతి ఐక్యతకోసం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సేవాలాల్ మహారాజ్‌ను బంజారాలు దేవుడిగా భావించి కొలుస్తారని పేర్కొన్నారు. సంఘసంస్కర్తగా, ప్రకృతి వన్యప్రాణులను కాపాడాలని సూచించేవారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ సేవాలాల్ చూపించిన మార్గంలో అందరూ ముందుకు సాగాలని అన్నారు. లంబాడ, బంజారాల జీవన విధానం బాగుపడటానికి సేవాలాల్ మహారాజ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. సేవాలాల్ మహారాజ్ జీవితం స్పూర్తిదాయకమని తెలిపారు.



బంజారా తెగలను తండాజీవితం వైపు మళ్లించారని, మద్యం, మాంసంను మన్పించే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడంతోపాటు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజ్, మాజీ కేంద్రమంత్రి బలరాంనాయక్, మున్సిపల్ ఛైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్‌రావు, సంత్‌శ్రీసేవాలాల్ మహారాజ్ కమిటీ సభ్యులు, బెల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం : శంకర్‌నాయక్



*గుండాల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :*

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో మా పార్టీ విజయం సాధిస్తుందని ఐఎన్‌టియుసి నేత శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రేస్ పార్టీ ఊపందుకుంటుందని రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న జోడో న్యాయ్‌యాత్రకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రేస్ అభ్యర్థిగా తను బరిలో ఉంటున్నాని తన గెలుపు కోసం కాగ్రేస్‌శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని అన్నారు. గుండాల ఈ మారుమూల ప్రాంతంలో ప్రజల అవసరాలను నిమిత్తం సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేయడంతో పాటు మండలంలో ఐటిఐ ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తుందని అన్నారు. బిజేపీ పార్టీ ప్రభుత్వం రైతాంగ సమస్యలను విస్మరించి న్యాయం కోసం పోరాడుతున్న రైతులపై దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక మంది పార్టీ టికెట్కుఐ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని తానుకూడా పోటీలో ఉన్నానన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పెంబోయిన ముత్తయ్య, మండల అధ్యక్షులు కెడెం ముత్యమాచారి, ఈసం పాపారావు, యస్‌కె ఖదీర్, సమ్మయ్య, మోహన్, రమేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

*వలిగొండ, ఫిబ్రవరి27,ప్రభాతవార్త :*

రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండలంలోని లోతుకుంట గ్రామంలోని మోడల్ స్కూల్ సెంటర్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సవరం 178 మంది, ద్వితీయ సంవత్సరం 173 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. అదేవిధంగా ప్రభుత్వ వెంకటేశ్వర జూనియర్ కళాశాల సెంటర్‌లో ప్రథమ సంవత్సరం 153 మంది, ద్వితీయ సంవత్సరం 137 మంది విద్యార్థులు వ్రాయనున్నట్లు ప్రిన్సిపాల్ వై.రామ, లక్ష్మికాంత్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లును పూర్తి చేశామని, అన్ని మౌళిక వసతులు ఏర్పాట్లు చేశామని తెలిపారు. విద్యార్థులు ఉదయం 8 గంటల నుండి ప్రవేశం ఉంటుందని, ఒక్క నిమిషం అలస్యం అయిన ప్రవేశం ఉండదని, విద్యార్థులు 8:45 గంటల వరకే సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. ఎస్ఐ డి.మహేందర్ లాల్ మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షల సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులు సమయానికి సెంటర్లకు చేరుకోవాలని సూచించారు.

## పిల్లలను ఎత్తుకెళుతున్నారన్న అనుమానంతో ఇద్దరిని బంధించిన గ్రామస్తులు

*వలిగొండ, ఫిబ్రవరి27,ప్రభాతవార్త :*



పిల్లలను ఎత్తుకెళుతున్నారన్న అనుమానంతో మంగళవారం మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన ఇద్దరి వ్యక్తులను గ్రామస్తులు దేహశుద్ధి చేసి గ్రామపంచాయతీ కార్యాలయంలో బంధించి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకొని విచారించిన అనంతరం ఎస్ఐ డి.మహేందర్ లాల్ తెలిపిన వివరాల కర్నూలు జిల్లాకు చెందిన ఇప్పె ముత్యాలు, అతని భార్య మంగలు కులం బెడబుడిగ జంగాలు, వీరు మదర్ ల్యాండ్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో ఉన్న ఓల్డ్ ఎజ్ హోమ్ పర్ అర్ఫన్స్ అన్ సంస్థ కోసం విరాలాల సేకరణ కోసం ఊర్లు తిరుగుతూ జీవనం సాగిస్తున్నట్లు తెలపడంతో వారిని తహసిల్దార్‌కు బైండోవర్ చేయడం జరిగినట్లు తెలిపారు.

## డయల్ 100పై విద్యార్థులకు అవగాహన



అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):
డయల్ 100పై అశ్వారావుపేట పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రైవేట్ స్కూల్స్‌కు వెళ్ళిన పోలీస్ సిబ్బంది విద్యార్థులకు డయల్ 100పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, ఇతర ఇబ్బందులు, అత్యవసర సమయాల్లో 100కు ఫోన్ కొట్టాలన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తల్లిదండ్రులకు కూడా డయల్ 100పై తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదువుకొని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ, కానిస్టేబుల్స్ ఉన్నారు.

## మరొక్కసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలి...

### బీజేపీ గెలుపుతోనే ప్రజాస్వామ్యం పరిరక్షణ




కారేపల్లి, ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త) :
కేంద్రంలో 3వ సారి బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోడీ మార్గదర్శకంలో మరొక్కసారి బీజేపీ ప్రభ/త్వం అధికారంలోకి రావాలని దేశం కోసం... ధర్మం కోసం మరొక్కసారి మోడీ సర్కార్ ఆవశ్యకత ఉందని భారతీయ జనతా పార్టీ క్రమ శిక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, విజయ సంకల్ప యాత్ర కాకతీయ క్లస్టర్ బాధ్యులు మారుతినేని ధర్మారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయసంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి కారేపల్లి బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.... పదేళ్ళ మోడీ పరిపాలన అవినీతి రహితంగా పాలన జరిగిందన్నారు. దేశాన్ని అభివృద్ధి పథం వైపు పడిపిస్తూనే దేశ ప్రజలందరికి సంక్షేమాన్ని అందించారన్నారు. దేశంలో 4కోట్ల మంది పేదలకు ఇల్లు కట్టించారని, 11కోట్ల మంది మహిళలకు గ్యాస్ పంపిణీ, 12కోట్ల మంది రైతులకు రూ. 6వేలు ఆర్థిక సహాయం, ప్రతి నెల 80కోట్ల మందికి రేషన్ దుకాణాల ద్వారా బియ్యాన్ని ఉచితంగా అందజేశారన్నారు. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరూ కరోనాతో మృత్యువాత పడకుండా కన్న తండ్రివలే కాపాడుకొని అందరికీ ఉచితంగా వ్యాక్సిన్ అందజేశామన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలతో పాటు దేశం, ప్రపంచ పటంలో శక్తివంతంగా ఉండేందుకు నిరంతరం కృషి చేస్తూ ప్రపంచ దేశాలకు ధీటుగా నిలబెట్టారన్నారు. గత పాలకుల హయాంలో అవినీతి రహితంగా పాలన సాగించడానికి చూసి ప్రతిపక్షాలు సహించలేకపోతున్నారన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజ్వామ్య పాలన జరుగుతుందన్నారు. ఎన్నికలలో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి ప్రభుత్వ సహకారంలో



భాగస్వాములై తమ ఓటు విలువను ప్రతి ఒక్కరూ పెంచుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా శ్యామ్‌రాథోడ్, వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు దనసరి శ్రీను, మండల బీజేపీ సీనియర్ నాయకులు తురక నారాయణ, రాంప్రసాద్, ప్రదీప్, సుజాత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):




అశ్వారావుపేట మండల నూతన తహశీల్దార్‌గా ఎం శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. త్వరలో జరుగు ఎన్నికల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానికంగా తహశీల్దార్‌గా పనిచేస్తున్న కృష్ణప్రసాద్ వేరే మండలానికి బదిలీ కాగా చర్లలో పనిచేస్తున్న ఎం శ్రీనివాస్‌ను అశ్వారావుపేట తహశీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టారు.

## పేటలో రోడ్డు విస్తరణ పనులు



అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):
మండల కేంద్రం అశ్వారావుపేటలో రహదారి విస్తరణ పనులను అధికారులు చేపట్టారు. ప్రధాన సెంట్రల్ లైటింగ్ రోడ్డు విస్తరణలో భాగంగా పనులు నత్తనడక సాగుతున్న క్రమంలో అధికారులు మంగళవారం మరలా పనులు ప్రారంభించినట్లు కనిపించింది. ఈ క్రమంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గల మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆర్అండ్‌బి అధికారులు తొలగించారు. జెసిబి సహాయంతో విగ్రహాన్ని ఆ ప్రదేశంలో తీసి పక్కన పెట్టారు.

## సిపిఐఎంఎల్ ప్రజాపంథాలో చేరిన పండూరి



దమ్మపేట, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):
బిఆర్ఎస్ పార్టీకి చెందిన పండూరి వీరబాబు మంగళవారం సిపిఐఎంఎల్ ప్రజాపంథా పార్టీలో చేరారు. ఈ మేరకు ప్రజాపంథా జిల్లా నాయకులు అమర్లపూడి రాము, గోకినేపల్లి ప్రభాకర్‌లు వీరబాబుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు రాజకీయాలు కొందరి స్వార్థం కసం స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ ప్రజలను పక్కదోవ పెట్టించి ప్రజలకు సమన్యాయం జరగకుండా దోపిడి దారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. అందుకే ప్రజ సమస్యలు పరిష్కరించాలని, దోపిడి పాలన కూల్చివేయాలనే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజాపంథా మాస్‌లైన్ ముందుకు సాగుతుందన్నారు. నిత్యం ప్రజా సమస్యల కోసం పోరాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండకడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాక వెంకటేష్, తామా రాముడు, బండి ఆదినారాయణ, కురసం ముత్యాలరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని పరామర్శించిన ఎమ్మెల్యే

దమ్మపేట, (ప్రభాతవార్త):



హైదరాబాద్ నీలోఫర్ హాస్పిటల్‌లో అడ్మిట్ అయి చికిత్స పొందుతున్న మండలానికి చెందిన చిన్నారిని శాసనసభ్యులు జారె ఆదినారాయణ పరామర్శించారు. మండల పరిధిలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సీతారాములు యొక్క మనుమరాలు గుండె ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ నీలోఫర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. ఈ నేపథ్యంలో జారె హాస్పిటల్‌కు వెళ్ళి బాలికను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి బాలిక ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జారెతో పాటు కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పీటిసి బత్తుల అంజి తదితరులు ఉన్నారు.




## సభల విజయవంతానికి ప్రజాపంథా బైక్ ర్యాలీ



దమ్మపేట, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):
మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మంలో జరుగు జాతీయ యూనిటీ మహాసభల విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సిపిఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో భారీ ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పట్వారిగూడెం, పార్కెలగండి, జగ్గారం, అంకంపాలెం, గండుగులపల్లి, మొండివర్రె, నాచారం, నాగుపల్లి, ముష్టిబండ, మొద్దులగూడెం, మండలపల్లి పంచాయతీల మీదుగా ర్యాలీ జరిపి దమ్మపేట చేరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు అమర్లపూడి రాము మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా రాష్ట్రాలకు సంక్రమించిన ఫెడరల్ హక్కుల్ని బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్ష పార్టీలను ప్రజాస్వామిక లౌకిక శక్తుల్ని అణచివేస్తుందని అది చాలక సిబిఐ, ఇడి, ఐటి సంస్థల ద్వారా దాడులు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గోకినేపల్లి ప్రభాకర్, కాక వెంకటేష్, చాప ముత్యాలరావు, కుంజా కాంతారావు, ఆదినారాయణ, ప్రసాద్, వాడె గిరి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఇంటర్ వార్షిక పరీక్షలు

### అన్ని ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

### పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన సిఐ, ఎస్ఐలు



అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):
నేటి(బుధవారం) నుండి ఇంటర్ మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసింది. మండల కేంద్రం అశ్వారావుపేటలో వికెడివిఎస్ రాజు జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనార్టీ గురుకుల కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఇప్పటికే నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ, విద్యాశాఖ నిబంధనల మేరకు హాల్‌టికెట్ నెంబర్‌లను కేటాయించారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకూ ఇంటర్ మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాన్ని నిర్ణీత సమయం కన్నా ముందుగానే చేరుకోవాలని విద్యార్థులను సూచించారు. ఇదిలా ఉండగా స్థానిక సిఐ కరుణాకర్, ఎస్ఐ శ్రీనులు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు సిఐ తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాసుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

# రాష్ట్రంలోనే వైరా మున్సిపాలిటీలో అధిక ఇంటి పన్నులు

## రూ.98లక్షల నుంచి రూ.3కోట్లకు టార్గెట్ పెంచిన ప్రభుత్వం

## ప్రజలపై ఇంటి పన్నులు భారం తగ్గించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు



వైరా, ఫిబ్రవరి27,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రంలోనే వైరా మున్సిపాలిటీలో ఇంటి పన్నులు భారం ఎక్కువ ఉందని, ప్రజలపై ఇంటి పన్నులు భారం తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరా మున్సిపాలిటీలో రూ.98లక్షల నుంచి రూ.3కోట్లు పన్నులు టార్గెట్ నిర్ణయం ఎలా చేశారని ప్రశ్నించారు. ఇంటి పన్నులు చూసి ప్రజలకు గెండెపోటు వస్తుందని అన్నారు. ఒకే మాదిరిగా ఉన్న నివాసాలకు రూ.500ల నుంచి రూ.5వేల వరకు బ్రాహ్మణపల్లి, బోడేపూడి కాలనీ, గండగలపాడు, లాలాపురం నిరుపేదలు నివాస గృహాల్లో కొన్ని కుటుంబాలకు రూ.5వేలు నుంచి రూ.10వేలు ఇంటి పన్నులు చెల్లించిన వారికి కూడా అదనపు చార్జీలు భారం వేస్తున్నారని రాంబాబు తెలిపారు. వైరా మున్సిపాలిటీ 2018లో నూతనంగా ఏర్పడిన సమయంలో ఐదు సంవత్సరాలు ఇంటి పన్నులు పెరగవని, అదనపు భారం ఉండదని, ప్రభుత్వం ప్రకటించి నేడు ప్రభుత్వం ఇష్టానుసారంగా పన్నులు భారం ప్రజలపై వేయడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వైరా పట్టణ కమిటీ సభ్యులు పైడిపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు టోకరా....




### రూ. 2కోట్ల 40లక్షలకు పైగా నష్టపోయిన బాధితులు

### ఫేక్ అపాయింట్‌మెంట్స్ నకిలీ ఉద్యోగాలు

### బాధితులు పోలీసులకు ఫిర్యాదు

కారేపలి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ః

స్వల్ప సమయంలో రూ. కోట్లు సంపాధించాలని మోసగాడి అత్యాశ నిరుద్యోగ యువకులకు శాపంగా మారింది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లభించక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల చుట్టూ ప్రదక్షిణాలు చేసి ఉద్యాగాలు రాక నిరాశ నిస్పృహల్లో కొట్టు మిట్టాడుతున్న నిరుద్యోగ యువకులని టార్గెట్‌గా తీసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని... మాయమాటలు చెఇప్ప ఒక మాయల మరాఠీ రూ. 2కోట్ల 40లక్షలకు పైగా పైకాన్ని మోసగించిన వైనం వెలుగులోకి వచ్చింది. దీనికి తోడు పలువురికి ఉద్యోగాలు లభించాయని నమ్మచూపి వారి ఖాతాల్లో ప్రతి నెల వేతనం వస్తున్నట్లు తెలపడంతో మరికొందరు యువకులు ఉద్యోగాల కోసం రూ. లక్షలు ఇచ్చినట్లు సమాచారం. ఫేక్ అపాయింట్‌మెంట్స్ సర్వీస్ రిజిస్టర్ బుక్కుల జారీ వ్యవహారం బయటపడడంతో ఈ ఘటన మండలంలో ప్రధాన చర్చా నియాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి మోసగాడు తన స్వంత బావ అయిన తులసీరామ్ ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.... సింగరేణి మండల పరిధిలోని పోలంపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు నిరుద్యోగ యువకులు సుమారు రూ. 2కోట్ల 40లక్షలకు పైగా పైకాన్ని భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తికి ఇచ్చి మోసపోయినట్లుగా తెలిపారు. ఉద్యోగం లేని నిరుద్యోగులను చూసి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నాకు పై స్ధాయి అధికారులతో పరిచమాలు ఉన్నాయని, గత 6నెలల నుండి మండలంలోని పలు గ్రామాలలో తిరుగుతూ నిరుద్యోగులను మభ్యపడుతూ... నిరుద్యోగుల వద్ద నుండి బారీగా వసూల్లకు పాల్పడినట్లు తెలిసింది. సదరు మోసగాడు ఇద్దరికీ టీచరు ఉద్యోగాలు, మరొకరికి స్టేనో ఇంకొకరికి రికార్డ్ అసిస్టెంట్ ఇంకో వ్యక్తికి కేటీపీఎస్‌లో ఏఈ ఉద్యోగం వచ్చినట్లు ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి బాధిత వ్యక్తులకు ఇవ్వడంతో పాటు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించినట్లు నకిలీవి సృష్టించి బాధితులకు చెక్కులు అందజేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బాధిత వ్యక్తుల వద్ద నున్న ఫేక్ డాక్యుమెంట్లను నిషితంగా పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పోలంపల్లి గ్రామానికి చెందిన 6గురు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇచ్చని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కారేపల్లి ఎస్సై తెలిపారు.




### నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

### నిమిషం లేట్ అయినా పరీక్షలకు అనుమతించం

కారేపల్లి,ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :

నేటి నుంచి మండల వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ విద్యార్ధులకు పరీక్షలు జరగనూన్నాయి. కారేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ కళ్ళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 277మంది మొదటి సంవత్సరం విద్యార్ధులు, 212మంది ద్వితీయ సంవత్సరం విద్యార్ధులు, ఆదర్శ కళాశాలలో 293మంది మొదటి సంవత్సరం విద్యార్ధులు, 263మంది ద్వితీయ సంవత్సరం విద్యార్ధులు పరీక్షలకు హాజరు కానున్నారు. నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్ధులను అనుమతించబోమని ప్రిన్సిపాల్ తెలిపారు.

### అంగన్వాడీ కేంద్రానికి బీరువా, కుర్చీలు వితరణ



కారేపల్లి,ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :

మండల పరిధిలోని భాగ్యనగర్‌తండా సెక్టార్ కోటిలింగాలపల్లి అంగన్వాడీ కేంద్రానికి ఈసాల రాజు ఒక బీరువా, 12కుర్చీలను మంగళవారం ఐసీడీఎస్ సిబ్బందికి వితరణగా అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ..... అంగన్వాడీ కేంద్రానికి మౌలిక వసతులు లేకపోవడం గమనించిన తాను బీరువా, కుర్చీలను అందజేసినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రానికి బీరువా, కుర్చీలను అందజేసిన ఈసాల రాజకు అంగన్వాడీ టీచరలన వి లీలావతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వి లీలావతి, ఆయా ఎం గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఓటు నమోదుపై మారుమూల ప్రాంతాల గిరిజనులకు అవగాహన



అశ్వాపురం,ఫిబ్రవరి27,ప్రభాతవార్త.

భద్రాచలం సమీకృత గిరిజనాభివృద్ది సంస్థ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ ఆదేశాలమేరకు 01ఏప్రిల్2024నాటికి 18సంవత్సరాలు నిండిన మారుమూల ప్రాంతాల గిరిజనులకు ఓటునమోదుపై అవగాహన కల్పించేందుకు మంగళవారం వేములూరు మనుబోతులగూడెం మనుబోతులగూడెం కింది గుంపు మల్లయ్యగుంపు పొడియం నాగేశ్వరరావు గుంపు గంగరాజు గుంపు గుండ్లమడుగు గుంపు గ్రామాలలో రెవెన్యూ అధికారులు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులకు ఓటునమోదు ప్రక్రియ ఓటు విలువ ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి స్వర్ణ డిప్యూటీ తహశీల్దార్ రషీద్ గిర్దావర్ రాజేశ్వరరావు స్థానిక బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

### పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నూరుశాతం పూర్తిచేద్దాం




అశ్వాపురం,ఫిబ్రవరి27,ప్రభాతవార్త.

మార్చి3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో పనిచేసి నూరుశాతం పూర్తి చేద్దామని ఎంపీపీ ముత్తినేని సుజాత పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఆరోగ్య అధికారులకు ఏఎన్ఎంలకు అంగన్‌వాడీ టీచర్లకు ఆశావర్కర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ మార్చి3న నిర్ణయించిన కేంద్రాలలో పల్స్‌పోలియోను పూర్తిచేయాలని, 4, 5తేదీలలో ఇంటింటికి వెళ్ళి చిన్నారులకు పోలియోచుక్కలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ కో ఆప్షన్‌సభ్యులు ఎస్కే ఖదీర్ మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సంకీర్తన ఎంపీడీఓ వరప్రసాద్ గిర్దావర్ నాగమణి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు టీచర్లు ఏఎన్ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### అభినవ శ్రీ వెంకటేశ్వరస్వామి తిరుకళ్యాణ మహోత్సవవేడుకలు

అశ్వాపురం,ఫిబ్రవరి27,ప్రభాతవార్త.



మండలపరిధిలోని నెల్లిపాక బంజరలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత స్వయంభూ అభినవ శ్రీ వెంకటేశ్వరస్వామి 20వ వార్షిక తిరుకళ్యాణ మహోత్సవవేడుకలు మంగళవారం ఆలయ పూజారి పరాంకుశం కృష్ణమాచార్యులు ఆలయ నిర్వహణ కమిటిసభ్యుల భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30గంటలకు స్వామివారికి అభిషేకం అందరినీ ఆహ్వానించడం పెండ్లికొడుకును చేయుట దంపతి తాంబూలాలు కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేశారు. తిరుకళ్యాణ వేడుకలలో నెల్లిపాక బంజర టేకులగుట్ట రామచంద్రాపురం గ్రామాల భక్తులు పాల్గొని భక్తి శ్రద్దలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని పూలమాలలతో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. తిరుకళ్యాణ మహోత్సవ వేడుకలతో గ్రామంలో పెళ్ళిసందడి నెలకొంది.

# పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

## - పది విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఎంఈఓ

*కల్లూరు, ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త)*





విద్యార్థులు పట్టుదలతో చదివి, ఉన్నత స్థానాలను అధిరోహించాలని మండల విద్యాశాఖాధికారి ఎన్. దామోదర ప్రసాద్ కోరారు. కల్లూరు విజ్ఞాన్ విద్యానికేతన్‌లో 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పదవ తరగతి ఒక టర్నింగ్ పాయింట్ అని, దానిని విద్యార్థులు పట్టుదలతో, క్రమశిక్షణా పద్ధతిలో ప్రణాళికా బద్ధంగా, ఇష్టంగా, కష్టపడి చదివి తల్లిదండ్రుల యొక్క ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను వారు నేర్పిన విద్యను నెమరువేసుకుంటూ జీవితంలో మీరు నేర్పిన విద్యాబోధన ఎల్లప్పుడూ గుర్తుంటుందని విద్యార్థులు అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలుకుతూ గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాలలో ఒకరినొకరు స్నేహభావంతో ఉంటూ జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల జోనల్ మాజీ అధికారి మేకతొట్టి పుల్లయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణయ్య, విజ్ఞాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్, పట్టణ ప్రముఖులు, పసుమర్తి చందర్‌రావు, బొప్పన శ్రీనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రీ షిర్డి సాయి వార్షికోత్సవ వేడుకలు

*తల్లాడ, ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త)*





మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో నేటి నుంచి శ్రీ షిరిడి సాయిబాబా 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మారెళ్ళ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం అన్నారుగూడెం పురవీధులలో పల్లకీ సేవ, సాయినాధుడి భారీ ఊరేగింపు కోలాట బృందంతో నిర్వహించారు. తొలుత సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారెళ్ళ లక్ష్మణ్‌రావు తోపాటు నాయకులు తుమ్మలపల్లి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు కలిసి పల్లకిని మోశారు. ఈ కార్యక్రమంలో మారెళ్ళ మమత, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ళ మల్లిఖార్జునరావు, తుమ్మలపల్లి సత్యనారాయణ, రాయల వెంకటయ్య, పొన్నం కృష్ణయ్య, ఆలయ కమిటి నిర్వాహకులు, సభ్యులు దుగ్గినేని గోపయ్య, నున్నా సాందీపులు, పూనాటి సత్యనారాయణ, పాపినేని మధుసూధన్‌రావు, ఆపతి రామారావు, మల్లిడి వెంకటేశ్వర్లు, మల్లిడి శేషయ్య, మారెళ్ళ వెంకటేశ్వరరావు, పసుమర్తి పుల్లారావు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలస్యంగా ఎందుకు వస్తున్నారని హెచ్‌ఎంను నిలదీసిన గ్రామస్థులు

## - గేటు వద్దే గంట పాటు హెచ్‌ఎంను ఆపిన గ్రామస్తులు

*తల్లాడ, ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త)*





మండల పరిధిలోని అన్నారుగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సమయ పాలన పాటించడం లేదని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన కొందరు ఆలస్యంగా వచ్చిన ప్రధానోపాధ్యాయురాలిని 40 నిమిషాలకు పైగా గేటు వద్దే ఆపి, నిలదీశారు. ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల ప్రక్క ప్రక్కనే ఉండటంతో పాఠశాల హెచ్‌ఎం సరోజిని మంగళవారం ఆలస్యంగా పాఠశాలకు హాజరు కాక మండల బిజెపి అధ్యక్షుడు ఆవతి వెంకట రామారావు ఆమెను గేటు వద్దే ఆపి, పాఠశాలకు ఎన్ని సంవత్సరాల నుండి ఇలా వస్తారు.. ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మంది బిసి, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులే విద్యనభ్యసిస్తున్నారని, మీరు సమయ పాలన పాటించకపోతే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. వారం రోజుల నుండి తాము పాఠశాలపై నిఘా ఉంచడంతో ఈ పరిస్థితి నెలకొందని, దీనికి మీరు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించగా హెచ్‌ఎం సరోజిని జోక్యం చేసుకుని పాఠశాలకు ఆలస్యంగా కావడం వలన సెలవు పెట్టేందుకు వచ్చానని చెప్పగా సెలవు ఈ సమయంలో ఎలా పెడతారని వాగ్వివాదానికి దిగాల్సిన పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న హైస్కూల్ ఉపాధ్యాయులు గేటు తీయడం కోసం ప్రయత్నించగా ఉపాధ్యాయులు మీ పరిధిలో మీరు ఉండండి, మీరు గేటు తీయ వద్దని అవసరమైతే నాపై కేసు పెట్టమని వాదించడంతో ఉపాధ్యాయులు వెనక్కి తగ్గారు. దీంతో గ్రామస్తులు మహిళా టీచర్ కావడంతో వదిలేయమని నాయకుడిని కోరగా ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పి వెళ్ళిపోగా సోషల్ మీడియాలో ఈ సంఘటన వైరల్‌గా మారింది.

# 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలి....

## జిల్లా కలెక్టర్ విపి గౌతమ్

*ఖమ్మం,ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త) :*

జిల్లాలో 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ పేర్కొన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులకు ఏర్పాటు చేసిన ఒకరోజు అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు హాజరౌతున్నందున విద్యార్థులలో పరీక్షల వ్యవస్థపై విశ్వాసం కలిగేలా పరీక్షల నిర్వహణ ఉండాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నుండి 10,148మంది, ప్రైవేట్ పాఠశాలల నుండి 6,429మంది, ప్రైవేట్‌గా 279మంది, మొత్తంగా 16,577మంది పరీక్షలు వ్రాయనున్నట్లు, వీరిలో 8,532మంది బాలురు, 8,045మంది బాలికలు ఉన్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 97పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి, 97మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 98మంది శాఖాధికారులు, 1,983మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. 53జోన్లుగా, 6రూట్లుగా విభజించి, 5ఫ్లయింగ్ స్క్వాడ్, 97సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారుల ఫోన్ నెంబర్లు ప్రదర్శించాలన్నారు. కనీస మందులతో ఏఎన్ఎం, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వాటర్ బాయ్ నుండి చీఫ్ సూపరింటెండెంట్ వరకు పరీక్షల విధుల్లో ఉన్న వారందరూ ఐడి కార్డులు ధరించాలన్నారు. 18మార్చి నుండి 10వ తరగతి పరీక్షలు జరగనున్నట్లు, ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30గంటల వరకు పరీక్షలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు, కనీస మౌళిక సదుపాయాల కల్పన చేయాలన్నారు. ఇన్విజిలేటర్లు పరీక్షకు ఒక గంట ముందుగా చేరుకోవాలన్నారు. ఉదయం 9:35నిమిషాల తర్వాత పరీక్షకు అనుమతించవద్దని ఆయన తెలిపారు. విద్యార్థులు, అధికారులు, సిబ్బంది అందరికీ ఫ్రిస్కింగ్ చేపట్టి తనిఖీలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144సెక్షన్ విధించాలని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో విధుల నిర్వహణాధికారులకు సంబంధించి బంధువులు ఎవ్వరు పరీక్షలు వ్రాయట్లేదని ధృవీకరణ తీసుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లకు లాటరీ పద్ధతి ద్వారా గదుల కేటాయింపు చేయాలన్నారు. మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించవద్దని ఆయన అన్నారు. ప్రశ్నాపత్రంలోని ప్రి పేజిలో విద్యార్థి హాల్ టికెట్ నెంబర్ వ్రాయించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు ఉండాలన్నారు. గోడ గడియారం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రశ్నాపత్రాలు సీసీ కెమెరాల నిఘాలో తెరవాలన్నారు. ఎక్కడ ఎటువంటి చిన్న తప్పిదం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ధన, మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, రాములు, ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, నారాయణ, చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు తదతరులు పాల్గొన్నారు.




# ఘనంగా జోష్నికా దేవి జన్మదిన వేడుకలు





*కల్లూరు, ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త)*

మండల పరిధిలోని పుల్లయ్య బంజర్ గ్రామంలో కటికి నరసింహారావు, మౌనిక దంపతుల ప్రథమ కుమార్తె జోష్నికాదేవి పదవ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల సమక్షంలో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదినాలో మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తమ్ముడు శివ సాయి కుమార్, కాకిత ఫణి కుమార్, శ్రీలక్ష్మి, బందెల సత్య మాణిక్యాలరావు, రామ తులశి, భాస్కర సత్య, వెంకట్రావు, కాకిత రామారావు, సత్యవతి, రూన్సీ, పద్మ, కె. రమాదేవి, కె. పద్మావతి, కె. వరలక్ష్మి, నరేష్, లక్ష్మి తదితరులు జన్మదిన శుభకాంక్షలు తెలిపారు.

# పల్స్ పోలీయోను నూరు శాతం విజయవంతం చేయండి



*తల్లాడ, ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త)*

మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని తల్లాడ మండలంలో నూరు శాతం విజయవంతం చేయాలని ఎంపిపి దొడ్డా శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంకై ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 56 పల్స్ పోలియో కేంద్రాలను 5 డివిజన్లుగా రూట్స్ కేటాయించి, మండల స్థాయి హెల్త్ అధికారులు సమగ్ర స్వీయ పర్యవేక్షణలో ఈ పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని, అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు విధిగా వ్యాక్సినేషన్ వేయించాలని కోరారు. బస్టాపుల్లోనూ, మైగ్రేషన్ సెంటర్లోనూ ఈ పల్స్ పోలియో కేంద్రాల నిర్వహణ జరుగుతుందని, ప్రతి కేంద్రంలో పకడ్బంధీగా ఏర్పాట్లు చేసి వ్యాక్సినేషన్ 100 శాతం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, ఐటిడిఏ స్పెషల్ ఆఫీసర్, తల్లాడ పిహెచ్‌సి విద్యాధికారి రత్న మనోహర్, హెల్త్ ఆఫీసర్లు భాస్కరరావు, పెద్ద పుల్లయ్య, హెల్త్ సబార్డినేటర్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా నాగేశ్వరరావు

కామేపల్లి,ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త) : భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా భట్టు నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నియామకపు ఉత్తర్వుల కాపీని అందుకున్న ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.... భారతదేశంలో అన్ని వర్గాలకు ముఖ్యంగా బడుగు బలహీన పేద ప్రజలకు అండదండగా ఉండి సేవలందించే పార్టీ భారతీయ పార్టీ అన్నారు. అనేక ఏళ్ళుగా పరిష్కారం కాని శ్రీరామచంద్రుని మందిర వివాదాన్ని పరిష్కరించిన పార్టీ బీజేపీ అన్నారు. గిరిజన వనదేవతలు సమ్మక్క-సారలక్క పేర్లతో గిరిజన యూనివర్సిటీ స్థాపించిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోని రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నాయకత్వంలో ముచ్చటగా 3సారి మన భారత ప్రధాని నరేంద్రమోడీ కావడం ఖాయమన్నారు. అధిక





మెజార్టీతో అధిక స్థానాలలో పార్టీ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. పార్టీలో సేవ చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ నాయక్, సహకరించిన పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి సురేష్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారు, విశ్రాత కలెక్టర్ రాంచంద్రుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌చందర్‌రెడ్డి, కాశం వెంకటేశం, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, బీజేపీ భద్రాద్రికొత్తగూడెం జిల్లా సమన్వయ కర్త సోమసందర్, కన్వీనర్ గోపికృష్ణలకు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. స్పోక్స్ పర్సన్‌గా నియమితులైన నాగేశ్వరరావుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు

నేలకొండపల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త): రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో భాగంగా మూడవ, నాలుగవ గ్యారెంటీలైన 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకం, రూ.500లుకే గ్యాస్ సిలెండర్ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంతరెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ప్రారంభించడం పట్ల నేలకొండపల్లి మండల మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ



కార్యాలయం నందు ఆనందోత్సవాలతో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌ను నేలకొండపల్లి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, కొరట్లగూడెం ఎంపిటిసి మెంబర్ రేగూరి వాసవి కట్ చేసి అందరికి పంచారు. కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ వారు నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎంపిపి వజ్జ రమ్య, నేలకొండపల్లి ఎంపిటిసి మెంబర్-2 దోసపాటి కల్పన, స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇంచార్జ్ రాయపూడి నారాయణరావు, మండల కాంగ్రెస్ నాయకులు చిలకల సీతారావమ్మ, కొత్త కురుణ, అత్తులూరి నాగలక్ష్మీ, రేగూరి హనుమంతరావు, దోసపాటి చంద్రశేఖర్, జెర్రిపోతుల సత్యనారాయణ, కందిమళ్ళ హరిబాబు, పగిడికత్తుల రాంబాబు, వజ్జ శ్రీనివాసరావు, కడియాల నరేష్, తేజావత్ కోటేశ్వరరావు, ఉసిరికాయల శ్రీనివాసరావు, దేవపొంగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# నేటి ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం

**-జూనియర్ కళాశాలలో 189 మంది- గురుకుల కళాశాలలో 245 మంది విద్యార్థులు**

నేలకొండపల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త): ఈ నెల 28వ తేదీ నుంచి జరుగనున్న ఇంటర్ పరీక్షలకు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎస్.ఎస్.ఎస్.శాస్త్రి, స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్స్‌పాల్ ఇ.ప్రమీల వేర్వేరుగా మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం నేలకొండపల్లి మండల కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 189 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల నందు 245 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో ఇంటర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు వారు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని వారు తెలిపారు.





## పెండింగ్ డీఏలను, బిల్లులను వెంటనే చెల్లించాలి...

కామేపల్లి,ఫిబ్రవరి 27, (ప్రభాతవార్త) : కార్యవర్గ సమావేశం మంగళవారం ఎంజెపల్లి పాఠశాలలో మండల అధ్యక్షులు ఎం నర్సింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావులు మాట్లాడుతూ....చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 3డీఏలను వెంటనే మంజూరు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న ఏరియర్స్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈపీఆర్‌సిలో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించి ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాల్లో వెలుగు నింపాలని కోరారు. అన్ని పాఠశాలలో స్వావెంజర్లను నియమించాలని, మౌళిక సదుపాయాలను మెరుగుపరచి పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలకు మినిమం టైమ్‌స్కేల్ వర్తింపజేయాలని కోరారు. కేజీబీవీ గురుకులాలు, సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరస్వామి కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో వి శ్రీనివాసరావు, వి వెంకటనర్సయ్య, బి తులసీదాస్, ఎస్‌కె నాగుల్‌మీరా, ఎం సోమయ్యచారి, లీలా వినోద్, పి సంధ్యారాణి పాల్గొన్నారు.

## నేటి నుండి పండితాపురంలో మినీ జాతర ప్రారంభం

కామేపల్లి, ఫిబ్రవరి 1, (ప్రభాతవార్త) : కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో సమ్మక్క - సారలమ్మ మినీ జాతర కార్యక్రమం బుధవారం నుంచి 3రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దొడ్డ శ్రీనివాస్, బోయినపల్లి శ్రీనులు మంగళవారం తెలిపారు. అమ్మవార్లను



వనం నుంచి 29న బోనాలు, మొక్కులు సమర్పించుట, మార్చి 1న కంకనాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర కార్యక్రమాన్ని భక్తులు, గ్రామస్తులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# పాలేరు




## కూసుమంచికి భారీగా బయలుదేరి వెళ్ళిన బీజేపీ శ్రేణులు



నేలకొండపల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త): కూసుమంచిలో జరిగే బీజేపీ విజయ సంకల్ప యాత్రకు మంగళవారం నేలకొండపల్లి నుంచి బీజేపీ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్ళారు. నేలకొండపల్లి మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వాహనాలలో అధిక సంఖ్యలో తరలి వెళ్ళారు. బీజేపి జిందాబాద్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ వారు నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల బీజేపి అధ్యక్షుడు మనె్న కృష్ణారావు, బీజేపి మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు షేక్.షరీఫుద్దీన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్, జిల్లా నాయకులు భవనాసి దుర్గారావు, కోటి హనుమంతరావు, బీజేపి మండల ప్రధాన కార్యదర్శులు పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, మండల బీజేపి నాయకులు నాగాచారి, సయ్యద్ మోహినుద్దీన్, బాజా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల ఆర్యవైశ్య సంఘం సమావేశం

నేలకొండపల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త): 2024-25 సంవత్సరంకు సంభందించి నేలకొండపల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నికల కోసం ఈ నెల 28వ తేదీ సాయంత్రం గంటలు 4-30 నిమిషాలకు స్థానిక వాసవి భవన్ నందు మండల ఆర్యవైశ్య సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు నేలకొండపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రమేష్ మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సమావేశంకు ఆర్యవైశ్య కులస్తులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.



## 5న మధుకాన్ షుగర్స్‌లో చెరకు క్రషింగ్ ముగింపు

నేలకొండపల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త): 2023-2024 సంవత్సరంకు సంభందించి వచ్చే మార్చి నెల 5వ తేదీన మధుకాన్ షుగర్స్ నందు చెరకు క్రషింగ్ ముగించనున్నట్లు మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. చెరకు రైతులు తమ కమతముల లోని చెరకును నరికి క్రషింగ్ ముగింపు నిర్ణీత సమయంలోగా ఫ్యాక్టరీకి సరఫరా చేయాలని వారు చెప్పారు. చెరకు క్రషింగ్ ముగింపు తర్వాత ఫ్యాక్టరీకి సరఫరా చేసే చెరకుకు ఫ్యాక్టరీకి ఎటువంటి బాధ్యత లేదని వారు తెలిపారు. చెరకు రైతులు సకాలంలో చెరకును ఫ్యాక్టరీకి సరఫరా చేసి మధుకాన్ షుగర్స్ యాజమాన్యంకు సహకరించాలని వారు కోరారు.

## మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

ఆలేరు, ఫిబ్రవరి27,(ప్రభాతవార్త) : కాలకృత్యాలు తీర్చుకుని వస్తున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసును గుర్తు తెలియని తెంచుకపోయిన సంఘటన మంగళవారం ఉదయం ఆలేరులో జరిగింది. స్థానిక 10వ వార్డుకు చెందిన ఎగ్గిడి సిద్ధమ్మ వేకువ జామున 5 గంటల సమయంలో ఇంటి ఆవరణలోని బాత్ రూమ్‌లో కాలకృత్యాలు తీర్చుకుని బయటకు వచ్చిన క్రమంలో అక్కడ మాటు వేసిన వ్యక్తి ఆమె మెడలోంచి మూడు తులాల బంగారు గొలుసును లాక్కుపోయాడు. మొదట్లో తన భర్త కొడుతున్నాడని భావించిన సిద్ధమ్మ, క్షణాల్లో అసలు విషయం గుర్తెరిగి ప్రతిఘటించినా ఫలితం లేకపోయింది. దొంగ పారిపోయాడు. ఆమె అరుపులకు భర్త సాయిమల్లయ్య బయటకు వచ్చి దొంగను వెంబడించినా ఫలితం లేక పోయింది. దొంగ సమీపంలోని దినేష్ డ్రెస్స్ వైపు ముళ్ల పొదల్లోకి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.వెంకటశ్రీను చెప్పారు.

# పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు
- ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షల నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా 12,341 మంది విద్యార్థులు
- 303 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ప్రియాంక అల




**కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:**

పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు, రూట్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి ఎంతో ప్రతిష్టాత్మకమైన పరీక్షల్ని ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించడతాయని అన్నారు. మొత్తం 12,341 మంది విద్యార్థులు ఉండగా అందులో 5900 మంది బాలురు, 6441 మంది బాలికలు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం 303 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రశ్నాపత్రాలు భద్రపర్చడానికి 23 పోలీస్ స్టేసన్లు ఏర్పాటు చేశామని, 73 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు 73 మంది, 720 మంది ఇన్విజిలేటర్లు, 3 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ బృందాలు విధులు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలను ముందుగానే తనిఖీ చేసి ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలు జవాబు పత్రాలు తీసుకెళ్ల అత్యంత జాగ్రత్త వహించాలని, ఏదైనా పొరపాటు జరిగినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని అన్నారు. విద్యార్థినులను తనిఖీ చేసేందుకు మహిళా కానిస్టేబుల్ లేదా మహిళా ఉపాధ్యాయురాలిని విధులు కేటాయించాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో రవీంద్రనాథ్, డీఈవో వెంకటేశ్వర చారి, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు, రూట్ ఆఫీసర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మహిళను హత్య చేసిన కేసులో ఇద్దరికి జీవితఖైదు

**కొత్తగూడెం లీగల్, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:**

మహిళను హత్యచేసిన కేసులో జీవితఖైదును విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు చెప్పారు. 7.01.2019న చుంచుపల్లి వీఆర్‌వో మంగతాయారు తన ఫిర్యాదులో 6.1.2019న రాత్రి చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డు కాలనీ పక్కన ఖాళీ స్థలంలో టెంపరరీ ఇంటి గదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉందని ఫోన్‌లో తనకు తెలియపర్చగా తాను వెళ్లి చూడగా మహిళ చనిపోయి నేలమీద ఉందని అప్పటి ఎస్సై కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో గుంటూరు జిల్లా కోసూరుకు చెందిన పెంద్రాల అల్లియ్య, పెంద్రాల కోటయ్య కుమారుడు అలియాకు కల్యాణికి ఎంగేజ్‌మెంట్ జరిగింది కానీ వివాహం కాలేదు. అల్లియాకు పాపమ్మతో వివాహం, కల్యాణికి రాంబాబుతో వివాహం జరిగింది. అలియాకు ఇద్దరు పిల్లలు, కల్యాణికి ఒక అమ్మాయి కాగా కల్యాణి భరనత రాంబాబు చనిపోయాడు. కాగా కల్యాణి పెంద్రాల అల్లియ్యతో అక్రమ సంబంధం పెట్టుకోగా అల్లియ్య భార్య పాపమ్మ రోజూ తగాదా పడుతుండటంతో వదిలించుకోవాలని చూశారు. అయితే దిష్టిబొమ్మల వ్యాపారం కోసం ఇల్లెందులో ఉంటూ కల్యాణిని అల్లయ్య తన మోటారు సైకిల్‌పై కొత్తగూడెంకు తీసుకొచ్చి అల్లయ్య, తన తండ్రి కోటయ్యలు కలిసి కల్యాణిని చంపేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ చార్జిషీట్ కోర్టులో దాఖలు చేశారు. కోర్టులో 19 మంది సాక్షులను విచారించారు. అలియా, కోటయ్యలపై నేరం రుజువు అయిందని, కోర్టులో ఇద్దరికి జీవితఖైదు, ఇద్దరికి చేరి వెయి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మీర్జా ఫిర్దౌషి నిర్వహించారు. లైజన్ ఆఫీసర్ వీరబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ లచ్చు సహకరించారు.

# సుజాతనగర్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం

- ఎనిమిది ఎంపీటీసీలకు ఆరుగురు హాజరుకావడంతో నెగ్గిన అవిశ్వాసం
- ప్రకటించిన డీఆర్‌వో రవీంద్రనాథ్

**కొత్తగూడెం, ఫిబ్రవరి 27 - ప్రభాతవార్త:**

జిల్లాలోని కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండల ఎంపీపీగా పదవీ బాధ్యతలు తీసుకున్న సమయంలో రెండున్నర సంవత్సరాలు పాటు ఒకరు, మరో రెండున్నర సంవత్సరాలు పాటు మరొకరు ఎంపీపీగా కొనసాగాలనే నిబంధన చేసుకున్నారు. ఆ నిబంధనకు కట్టుబడి ఉన్న ఎంపీటీసీలు అందరూ కలిసి రెండున్నర సంవత్సరాల పదవీ కాలం పూర్తి కావడంతో బాధ్యతలు నిర్వహిస్తున్న ఎంపీపీ భూక్యా విజయలక్ష్మిని తన పదవి నుంచి తప్పుకోవాలని, ఆమె స్థానంలో వైస్ ఎంపీపీగా ఉన్న అనీతకు ఆ పదవిని ఇవ్వాలని చెప్పారు. అయితే తాను ఎంపీపీగానే కొనసాగుతానని, పదవీ విరమణ సమయంలో చేసిన ఒప్పందం చెల్లదని, తానే కొనసాగుతానని, ససేమీరా అని ప్రస్తుత ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి ఖరాఖండిగా చెప్పి ఎవరి మాట వినలేదు. దీనిపై సమావేశాలు నిర్వహించి అందరూ ఎంపీటీసీలు నిరసనలు తెలిపినా కానీ ఆమె ఒప్పుకోలేదు. దీంతో పాటు మండలంలో జరిగే అభివృద్ధి పనులు అయినా కానీ, ఇతర పనులు కానీ ఎంపీటీసీలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే, తమతో చర్చించకుండానే ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఆమె ఒంటెద్దు పోకడలు పోతుందని పలువురు ఎంపీటీసీలు ఆరోపిస్తూ అవిశ్వాస తీర్మానానికి పూనుకున్నారు. అయితే మండలంలో మొత్తం ఎనిమిది మంది ఎంపీటీసీలు ఉండగా అవిశ్వాస తీర్మానం చేసిన వారిలో ఆరుగురు హాజరుకావడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఈ నేపధ్యంలో మంగళవారం డీఆర్‌వో రవీంద్రనాథ్ సమక్షంలో సుజాతనగర్ ఎంపీడీవో కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరిగింది. మొత్తం ఆరుగురు ఎంపీటీసీలు హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వడంతో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి అవిశ్వాసంలో ఓడిపోయారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు మీడియాతో మాట్లాడుతూ... రెండున్నర సంవత్సరాలు పాలన చేయాలని ప్రమాణ స్వీకారం సందర్భంగా అగ్రిమెంట్ చేసుకున్నామని, దాని ప్రకారమే మేమంతా ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి ఉన్నామని, ఎలాంటి వ్యక్తిగత కారణాలు మాత్రం లేవని, ఆ సమయంలో ఎంపీపీ, ఆమె భర్త, ఎంపీటీసీలు, పెద్దలు అందరూ సంతకాలు చేసుకున్న ఒప్పంద పత్రాలు ఉన్నా కానీ ఆమె మాత్రం ఒప్పుకోకపోవడం లేదని, అందుకే మేమంతా వైస్ ఎంపీపీ బానోత్ వైపు నిలబడ్డామని, అనీతకు సపోర్టు చేస్తున్నామని అన్నారు. అదే విధంగా ఏకపక్ష నిర్ణయాలతో మాకు చెప్పకుండానే, మాకు ఎలాంటి గౌరవం ఇవ్వకుండా ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని చెప్పారు.


వార్త
విలేకరులు కావలెను
ప్రముఖ తెలుగు జాతీయ దిన పత్రిక వార్త లో పనిచేయుటకు ఈ కింది సెంటర్‌లో అనుభవం కలిగిన విలేకరులు కావలెను.
అనుభవం కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత
ఖమ్మం జిల్లా : తిరుమలాయపాలెం, కూసుమంచి, వైరా టౌన్, మధిర టౌన్
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : మణుగూరు టౌన్, మణుగూరు రూరల్, సుజాతనగర్, టేకులపల్లి
సంప్రదించాల్సిన చిరునామా
జె వెంకటరత్నం
వార్త చీఫ్ బ్యూరో
సెల్ : 8008003364